నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 1-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 272 | పేజీలు: 6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

మరణం తథ్యం
తిమిరంతో సమరం
ధైర్యంతో సాగు

మిఠాయి పొట్లం
చిటారుకోటకొమ్మ
అందాలి కదా!

డెల్టా వేరియంట్
కరోన మరోరూపం
టికా భరోసా

ధనిక రాష్ట్రం
ప్రగతి చతికిల
దానధర్మాలు

అధికసంతు
అక్కడో కొత్త చట్టం
వృద్ధుల రాజ్యం

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

అధ్యక్ష పదవి పొందిన
యువ ప్రతినిధి రేవంతుడు !
కాంగ్రేసును భుజమ్మీద
ఎత్తుకున్న హనుమంతుడు !

జాడ కొరకు మీదికెగిరి
సముద్రాన్ని దాటేనా ?
ఓట్ల కొరకు చెక్క భజన
పాడు పాత పాటేనా ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

రాష్ట్రంలో భారీ ఎత్తున స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటు

హైదరాబాద్ , జూన్ 30: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లకు సంబంధించి విస్తృత స్థాయి సమావేశం ఈరోజు టియస్ఐఐసి కార్యాలయంలో జరిగింది. పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో పాటు పరిశ్రమలు, వ్యవసాయం, సివిల్ సప్లైస్ వంటి వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు భారీగా పెరిగాయన్నారు. ఒకప్పుడు దుర్భిక్ష ప్రాంతాలైన మహబూబ్ నగర్ లాంటి జిల్లాలు మొదలుకొని తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలు ప్రాజెక్టుల నీటితో కళకళలాడుతున్నయని, వ్యవసాయ రంగ అభివృద్ధి భారీగా పుంజుకుందని తెలిపారు. తెలంగాణ భారతదేశంలో రెండో హరిత విప్లవానికి నాంది పలికిందని, దీంతోపాటు మాంసం, పాల ఉత్పత్తి, మత్స్య రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతందన్నారు. అయితే ప్రస్తుతం పెరిగిన వ్యవసాయ ఉత్పత్తులకు అవసరమైన డిమాండ్‌ని మార్కెటింగ్ సదుపాయాలను క్రియేట్ చేయాలంటే భారీ ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని రాష్ట్రంలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం కేవలం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మాత్రమే ఏర్పాటు చేయకుండా ప్రత్యేకంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ సృష్టించే అవకాశం కలుగుతుందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రధానంగా పండుతున్న వరితో పాటు, తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ఆయిల్ ఫామ్ వంటి నూతన పంటల భవిష్యత్ అవసరాలను కూడా ఈ స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూని ట్లు ఏర్పాటులో పరిగణలోకి తీసుకుం టామన్నారు. తెలంగాణలో పండుతున్న పంటల తాలూకు ఫుడ్ మ్యాప్ ని తమ పరిశ్రమల శాఖ తయారు చేసిందని, ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పండేందుకు అవకాశాలు ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా ఈ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఈ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటుకు సంబంధించి ప్రస్తుతం జరుగు తున్న కసరత్తును అధికారులు వివరించారు. ఒక్కో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కనిష్టంగా 225 ఎకరాలకు తగ్గకుండా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఈ జోన్లలో విద్యుత్తు, రోడ్లు, తాగునీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ, కామన్ అఫ్లుయంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ వంటి అన్ని రకాల మౌలిక వసతులు ఉంటాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పండుతున్న వరి, మిరప, పసుపు, చిరుధాన్యాలు, వంట నూనెలు, పండ్లు-కూరగాయల ప్రాసెసింగ్, స్టోరేజ్, మార్కెటింగ్ అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇప్పటికే ఈ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల కు సంబంధించి ప్రభుత్వం పిలిచిన ఎక్స్రెషన్ అఫ్ ఇంట్రెస్ట్ కి సుమారు 350 దరఖాస్తులు అందాయని, అయితే ఈ ఎక్స్రెషన్ అఫ్ ఇంట్రెస్ట్ గడువును మరింతగా పెంచి మరిన్ని కంపెనీలను భాగస్వాములను చేయాలని అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి స్థానిక రైతాంగం నుంచి ఇప్పటికీ పలు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఈ జోన్లకు అవసరమైన భూసేకరణ వంటి అంశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా చొరవ చూపించాలని మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అద్భుతమైన అండ లభించిందని ఈ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశ ఆర్థిక ప్రగతి మరింతగా ముందుకు పోవాలంటే వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, డిమాండ్ కల్పించడం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. పరిశ్రమల శాఖ ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న ఈ ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యకు చక్కటి పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు.

మంత్రి గంగుల మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి చాలా పెరిగిందని, అందుకనుగుణంగా మిల్లింగ్ కెఫాసిటీ పెంచడం కోసం ఈ జోన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాన్నారు. దాదాపు 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేవలం నాలుగు నెలల కాలంలోనే ఎఫ్.సి.ఐకు అందించడంలో ప్రతి సంవత్సరం ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఇబ్బందులను అధిగమించడానికి మిల్లింగ్ ఇండస్ట్రీకు ప్రోత్సాహం ఇచ్చేలా నూతన పాలసీ రూపొందించాలన్నారు. పారా బాయిల్డ్, స్టీమ్ మిల్లులకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని అందుకనుగుణంగా ఈ జోన్లలో ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లింగ్ పెరిగితే చైనా లాంటి దేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతి చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.

పేదల కోసమే సీఎం సహాయ నిధి : బాల్క సుమన్

మంచిర్యాల, జూన్ 30 : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 130 మంది లబ్ధిదారులకు రూ. 40 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఎంతో మంది కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్‌తో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణుకుంట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ ప్రభుత్వంపై కాషాయపార్టీ కుట్ర : మమతా బెనర్జీ

కోల్‌కతా, జూన్ 30: : తన ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. నకిలీ వ్యాక్సిన్ స్కామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుందని ఆమె స్పష్టం చేశారు. జాతీయ టీవీ చానెళ్లను మోదీ ప్రభుత్వం డిక్టేట్ చేస్తూ దుష్ప్రచారం సాగిస్తోందని దీదీ మండిపడ్డారు. బెంగాల్ ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చేందుకు హోం మంత్రిత్వ శాఖ కార్యాలయం వేదికగా కుట్ర జరుగుతోందని విమర్శించారు.

బెంగాల్ కంటే చిన్న రాష్ట్రాలకు తమతో పోలిస్తే అధికంగా వ్యాక్సిన్ డోసులు పంపారని ఆరోపించారు. తమకు 1.99 కోట్ల వ్యాక్సిన్ డోసులు రాగా ఇప్పటికే 1.9 కోట్ల డోసులను ప్రజలకు అందించామని చెప్పారు. ప్రస్తుతం తమ వద్ద వ్యాక్సిన్ నిల్వలు లేకపోవడంతో కోల్‌కతాలో కేవలం రెండవ డోసు మాత్రమే వ్యాక్సినేషన్ సాగుతోందని తెలిపారు. కాగా కోల్‌కతాలో కొన్ని ప్రాంతాల్లో అనధికార వ్యాక్సిన్ క్యాంపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర నివేదిక అందించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బెంగాల్ సర్కార్‌ను కోరిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై దీదీ విరుచుకుపడ్డారు.

తుది దశకు నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ

హైదరాబాద్ , జూన్ 30:కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఎన్ఐసీ, టీఎస్ వెరిఫికేషన్ పూర్తయి జిల్లాల వారీగా జరుగుతున్న ధ్రువీకరణ ప్రక్రియ చాలా వేగంగా జరుగుతున్నది. ఇదే అంశంపై రాష్ట్ర బీసీ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,15,901 అప్లికేషన్ల విచారణ తుదిదశకు చేరుకుందని మంత్రి తెలిపారు.

త్వరలోనే లబ్ధిదారులను గుర్తించి వీలైనంత త్వరగా వారికి కార్డులతో పాటు రేషన్ ఒకేసారి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి గంగుల అధికారులను ఆదేశించారు.

పదిహేను రోజులుగా జిల్లా స్థాయిలో రెవెన్యూతో పాటు ఇతర సిబ్బంది, జిహెచ్ఎంసీతో పాటు ఇతర సిబ్బంది నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హులను గుర్తించడం కోసం జిల్లా కలెక్టర్లు, డీఎస్వోలు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నారు.

నూతన కార్డుల జారీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఎంత భారం పడినా సిద్ధంగా ఉన్నాం.సీఎం కేసీఆర్ ప్రతి పేదవాడి ఆకలిని తీర్చడానికి నిరంతరం కృషి చేస్తారన్నారని మంత్రి ప్రశంసించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేసిన మంత్రి

జనగామ, జూన్ 30: : దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తూ.. రాష్ట్ర బడ్జెట్ లో పెద్దపీట వేసి ప్రాధాన్యత కల్పించిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం పాలకుర్తి నియోజకవర్గంలోని 119 మంది దివ్యాంగులకు 37 వేల విలువైన బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..

ప్రభుత్వం దివ్యాంగులకు రాష్ట్ర బడ్జెట్ లో పెద్దపీట వేసిందన్నారు. సీఎం కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమానికి నెలకు150 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని తెలిపారు. అలాగే ఉద్యోగ అవకాశాల్లో 4 నుంచి 5 శాతానికి పెంచారని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాల్లో వికలాంగులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. హరితహారాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే నియోజకవర్గంలో విద్యారంగం అభివృద్ధికి విద్యార్థుల శాతాన్ని బట్టి మండలానికి ఐదు ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుంటానని హామీనిచ్చారు. పారిశుధ్య నిర్వహణలో పక్కాగా ప్రణాళికలు అమలు చేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

తాగునీటి ట్యాంక్ లను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలి. లీకేజీలు ఉన్న పైప్‌లైన్‌లు, నళ్లలను సరిచేయాలన్నారు. సీజన్ వ్యాధులు ప్రబల తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మన రాష్ట్రం ఉపాధి హామీ అమలులో మొదటి స్థానంలో ఉంది. పూర్తిస్థాయిలో ఉపాది కల్పించడానికి లేబర్ కాంపోనెంట్ ను గరిష్టంగా వినియోగించుకోవాలి. అందుకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో పల్లె ప్రగతిని విజయవంతం చేద్దాం

మహబూబాబాద్, జూన్ 30: పల్లె ప్రగతి అంటే పల్లెలో ఉండే ఉద్యోగులు, ఐటీ, సాఫ్ట్ వేర్, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులందరి సహకారంతో కొనసాగే ప్రగతి. ఇందులో అందరినీ భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పల్లెలను అభివృద్ధి చేసుకునేందుకు సీఎం కేసీఆర్ కల్పించిన గొప్ప అవకాశం పల్లె ప్రగతి అన్నారు. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం పనులపై మహబూబాబాద్, నందన గార్డెన్స్ లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.

పల్లె ప్రగతి పనులు ప్రణాళిక బద్ధంగా కొనసాగించేందుకు ప్రతి గ్రామంలో గ్రామ సభ పెట్టి, అక్కడి అవసరాలను గుర్తించాలని, వాటిని ఈ పది రోజుల్లో చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈ గ్రామ సభకు భాగస్వాములందరిని ఆహ్వానించాలని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో ఇంకా ఏయే అవసరాలు ఉన్నాయి. ఎలాంటి కార్యక్రమాలు చేయాలో కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని సమర్పించాలన్నారు. ముఖ్యంగా దళితవాడలకు వెళ్లి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. వారి అవసరాలు గుర్తించి, వాటిని తీర్చే విధంగా ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వైకుంఠదామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు అసంపూర్తిగా ఉంటే వెంటనే వాటిని పూర్తి చేయాలని, పూర్తి అయిన వాటిని వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. సీఎం కేసీఆర్‌కు హరితహారం అంటే అత్యంత ఇష్టమని, ఇది ఆయన మానస పుత్రిక అన్నారు. దీనిని అందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్ పర్సన్ కుమారి బిందు, ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్ నాయక్, హరిప్రియ నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ వి.పి గౌతమ్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, అభిషేక్ అగస్త్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

న్యూఢిల్లీ, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులోని యూపీ గేట్ వద్ద గత కొన్ని నెలలుగా నిరసన చేస్తున్న రైతులు, బీజేపీ కార్యకర్తల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. ఢిల్లీ నుంచి వస్తున్న కొత్తగా నియమితులైన బీజేపీ కార్యదర్శి అమిత్ వాల్మీకి స్వాగతం పలికేందుకు ఢిల్లీ-ఘాజియాబాద్ ఎక్స్‌ప్రెస్‌వేను అనుసంధానించే హిండన్ ఎలివేటెడ్ రహదారి ప్రారంభం వద్దకు సుమారు 400 మంది బీజేపీ కార్యకర్తలు చేరగా మరోవైపున ఉన్న రైతులు వందల సంఖ్యలో తమవైపునకు వచ్చి దాడి చేశారని ఘజియాబాద్ బీజేపీ యూనిట్ నగర అధ్యక్షుడు సంజీవ్ శర్మ ఆరోపించారు. పలువురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారని, పలు వాహనాలు ధ్వంసమయ్యాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కాగా తమ శాంతియుత నిరసనను భగ్నం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారని సంయుక్త కిసాన్ మోర్చా ప్రతినిధి జగ్తార్ సింగ్ బజ్వా తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు రైతులు, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ విషయం తెలిసిన వెంటనే అక్కడకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దినట్లు ఘజియాబాద్ ఎస్పీ జ్ఞానేంద్ర కుమార్ సింగ్ తెలిపారు. ఇరు వర్గాలు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

హరితోత్సవానికి అంతా సిద్ధం : మంత్రి ఐకే రెడ్డి

హైదరాబాద్ , జూన్ 30:తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏడో విడత హరితహార కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యా యని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకర్ రెడ్డి తెలిపారు. జూలై 1 నుంచి జూలై 10 వరకు ఏడో విడత హరితహార కార్యక్రమం కొనసాగనుందన్నారు. అంబర్‌పేట్ కలాన్ లోని ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా కార్యక్రమ ప్రారంభోత్సవానికి వేదిక కానుందన్నారు. ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి హరితహార కార్యక్రామాన్ని లాంఛనంగా ప్రారంభించను న్నట్లు ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. హరిత హారంలో భాగంగా హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన అంబర్ పేట్ కలాన్ అర్బన్ ఫారెస్ట్ పార్కును కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆరు విడతల హరిత హారం విజయ వంతమైన స్ఫూర్తితో ఏడో విడత హరిత హారం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజ లందరూ భాగస్వాములై మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

పోలీసులను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్, జూన్ 30:శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సామాన్య పౌరుడి నుంచి ఉన్నత స్థానంలో ఉండే వ్యక్తుల దాకా రక్షణ కల్పించడానికి పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది. మా విధి నిర్వహణను కించపరుస్తూ, అసభ్యకరంగా మాట్లాడిన రాఘవేందర్ రాజు అలియాస్ రఘు పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఎమ్.వెంకటయ్య అన్నారు.

ఈ నెల 22 న స్థానిక ప్రెస్ క్లబ్‌లో కొందరు జరిపిన సమావేశంలో రాఘవేందర్ రాజు అనే వ్యక్తి, మహబూబ్‌నగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌ను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడడం పట్ల పోలీసు సంఘం తీవ్రంగా ఖండించింది. పౌరుల, ప్రజల, ప్రభుత్వ ఆస్తుల రక్షణ నిమిత్తం తాము వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో వ్యక్తిగత ఆలోచనలు, అభిప్రాయాలకు తావుండదని తెలిపారు. పోలీసు విధుల పట్ల, పోలీసు అధికారి గురించి అసభ్యంగా మాట్లాడడం పోలీసు శాఖను కించపరచడం పట్ల సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో ఈరోజు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ ఎల్లవేళలా కష్టపడుతుందన్నారు. ప్రజల అభిమానంతోనే తాము ఉత్సాహంగా పని చేస్తున్నామని వెంకటయ్య వివరించారు. సమావేశంలో పోలీసు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాలగేయం

నీటి విలువ

ధనముకన్న విలువైనది
జలమన్నది తెలుసుకో..!
ప్రతి ప్రాంతపు ప్రగతియంత
నీటితోనె తెలుసుకో! ॥ధ॥

వృధా చేయకా నీటిని
సదా నిలువరించగాను
నేర్పుతోడ బొట్టు బొట్టు
నెమ్మదిగా ఒడిసిపట్టు! ॥ధ॥

భూగర్భ జలాల స్థాయి
భూరిగాను పెరిగేలా
ఇంగితంగ ఇంటిముందు
ఇంకుడుగుంతను పెట్టు! ॥ధ॥

కురిసే వానల, వరదల
కుంటలలో– చెరువులలో
నిలుపుకున్న పలుపంటల
గెలుపు మనకు కలిగేను! ॥ధ॥

– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

చరిత్రలో నేటినిజం

కం॥ ఒకనాటి 'యంగుటర్లు' X
చికిలం చినఘను పై 'చంద్రశేఖరు' పాపై
ప్రకటితమగు విప్లవయై
అకలంక 'ప్రధానమంత్రి' యయ్యెను మనకున్ !!

–రాధశ్రీ

(జూలై 1 మాజీ ప్రధాని చంద్రశేఖర్ జయంతి...)

సెల్: 9494481210

హైదరాబాద్ పాతనగర కవుల వేదిక
సురభి ఎడ్యుకేషనల్ సొసైటి
సంయుక్త ఆధ్వర్యంలో

పి.వి. శతజయంతి కవితల పోటీ

హైదరాబాద్ పాతనగర కవుల వేదిక స్వర్ణోత్సవ శ్రీ పి.వి.నరసింహారావు శతజయంతి (1920-2021) సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో విజేతలను ప్రకటించింది.

విజేతల బ్యాంక్ అకౌంటుకు బహుమతి మొత్తం ట్రాన్స్‌ఫర్ చేయబడుతుంది. కావున విజేతలందరూ తమ బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను కార్యదర్శికి వాట్సప్‌లో (వాట్సప్ నెం. 9703542598, 9182178653) వెంటనే పంపాలి.

బహుమతి పొందిన కవితలు

మొదటి బహుమతి	:	లోపలి మనిషి – శ్రీ నూచెంకి రవీంద్ర
ద్వితీయ బహుమతి	:	బలగంలేని బలమైన నాయకుడు – శ్రీ గుండేటి రమణ
తృతీయ బహుమతులు	:	1. తోరణాలు – శ్రీమతి అరుణ నారదభట్ల
		2. నీవు ఎవరు? – శ్రీమతి పి.వి.ఎస్. కృష్ణకుమారి
ప్రత్యేక బహుమతి	:	పీవీ రీవి – శ్రీమతి మంజుల సూర్య
కన్సోలేషన్ బహుమతులు	:	1. రథసారథి – శ్రీమతి ములుగు లక్ష్మీమైథిలి
		2. నిన్ను తలంచి– శ్రీమతి సమ్మెట విజయ
		3. శేషకీర్తి సువర్ణఫలం – శ్రీ కొత్తపల్లి ఉదయబాబు
		4. స్మరణ – శ్రీ గుమ్మడి సాంబమూర్తి
		5. సహస్రఫణి – శ్రీ తిరునగరి శ్రీనివాస్
		6. అపర చాణక్యుడు – శ్రీమతి నేమాల కమలాకర్ సుజాత
		7. ఆయనొక హౌని – శ్రీమతి పూసల రజనీ గంగాధర్
		8. స్థిత ప్రజ్ఞాశాలి – శ్రీ కొలిపాక శ్రీనివాస్
		9. దేశగతి మార్చిన మహాఋషి – వాడపర్తి వెంకటరమణ

కవితల పోటీలో పాల్గొని బహుమతి పొందినవారిని, ప్రోగ్రాంలో పాల్గొన్న కవులు, కవయిత్రులకు మరియు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీమతి శీలా సుభద్రాదేవి, డా॥ కొందుపల్లి నీహారిని, శ్రీ వి.పి. చందర్ రావు గారలకు సురభి ఎడ్యుకేషనల్ సొసైటి చైర్‌పర్సన్ మరియు ఎమ్.ఎల్.సి. శ్రీమతి సురభి వాణిదేవి గారు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నారు.

కొర్రుప్రోలు హరనాథ్
కార్యదర్శి
హైదరాబాద్ పాతనగరం కవుల వేదిక

విధాతకు విన్నపం

*

ఇల్లపై కన్నుబడ తెరవగానే
కలయో నిజమో అర్థంగ్లు
కనబడే తల్లినేల!
వెన్నెల వెన్నలను అందించే చంద్రశాల!
అమ్మ పెనవు చందమామనే!
ఆ అద్దంలో ప్రతిబింబించే
అందమైన వదనం తానే!
పాలకడలిలో శేషతల్పంపై
పడుకొన్న తీరు!
అమ్మ ఒడిలో ఆడంబలతీరు!
చదువుకొన్నబడి
చదువు నేర్పిన గురువులగన్నవడి
ఇరవై కనబడుతూ
వినబడుతూనే ఉంది!
నాటగుగాడలమధ్య
నాడు గడిపిన ఉనికాట
ఇప్పుడు ప్రపంచం అంతా తిరిగినా
ఎప్పుడూ తిరిగి రాలేదు
కాలం వెనుకకు తిరిగితే బాగుండేది
ఎంత త్వరగా ముగిసింది బాల్యం?
నూకేళ్ల బాల్యం ఉంటే ఎంత బాగుండేదో?
అరవై ఏండ్లకే మరణంతరమా!
ఎందుకు బ్రతుకు అంత తొందర?
త్వరత్వరగా జారుతూ కనుమరుగవడం
కన్నుమూసి తెరిచేలోగా
యుగాలకే దాటుకేయడం
తుగునా నీకు విధాతా?
మళ్లీ ఒక్కసారి ఆలోచించు!
మానవ జీవనమిదిమాత్రం మార్చు!
భూమిని అభినందనగా తీర్చు!!

డా॥ అనుపాటితం నడేశ్వరయ్య
9440468557.

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 1-7-2021

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

-శ్రీదాసం లక్ష్మయ్య
జర్నలిస్ట్, నేటికవిత
9440155240

-దాసం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

నేటికవితలో ఈ వారం: 'కాలాన్ని నిద్రపోనివ్వను' అనే అంశంపై వచ్చిన 55 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

నేను నిద్రపోకుండా

ఓ కాలమా!
నీ విశ్వరూపమెరగని క్షణాన
నాకై చూసే ఎన్నో వసంతాలను జారవిడిచి
శిశిర ఈసడింపుల మధ్యనిన్ను నిందిస్తూ
నన్ను నేను నిట్టూర్చుకుంటూ..
వర్తమానాన్ని వృధాగా
భూతకాలానికి సమర్పించుకుంటున్నాను
శిల్పంగా మారవల్సిన నేను
శిలగా మిగిలిపోతూ...
చేతులు కాలక మునుపే
ఓ జ్ఞానపుష్పం
మనోసరస్సులో వికసించింది
గుణపాఠ కిరణాల తాకిడితో..నేడు
మిగిలిన గడియలతో
అందమైన పందిరి నిర్మించుటకై
నిరంతర పరుగు పందెమును సృష్టించుకుంటూ
కాలాన్ని నిద్రపోనివ్వకుండా
నేను నిద్రపోకుండా
పడిలేచే కెరటాన్నై
విజయతీరాలను తాకుటకై

-శ్రీదేవి సురేష్ కుసుమంచి
7032760484

విజయనగరం కు చెందిన కవయిత్రి శ్రీదేవి సురేష్ కుసుమంచి గారు కాలాన్ని నిద్రపోనివ్వను అంశంపై నేను నిద్రపోకుండా శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం ఆలోచనాత్మకంగా మలచబడింది. కాలాన్ని నిద్రపోనివ్వకుండా.. నేనూ నిద్రపోకుండా.. పడిలేచే కెరటాన్నై విజయతీరాలను చేరేందుకు గత అనుభవాలను సమీక్షించుకుంటూ వర్తమానంలో జీవిస్తూ భవిష్యత్తుకై తానే చక్కని ప్రణాళికను రూపొందించుకుంటానన్న అర్థం ధ్వనించేలా కవయిత్రి శ్రీదేవి గారు తమ కవితను తీర్చిదిద్దారు. ఓ కాలమా! నీవిశ్వ రూపమెరుగని క్షణాన నాకై చూసే ఎన్నో వసంతాలను జారవిడిచి శిశిర ఈసడింపుల మధ్యనిను నిందిస్తూ నన్ను నేను నిట్టూర్చుకుంటూ వర్తమానాన్ని వృధాగా భూతకాలానికి సమర్పించుకున్నానంటూ కవిత ఎత్తుగడలోనే వృధాకాలాన్ని జారవిడుచుకున్నందుకు పశ్చాత్తపడుతూ కాలం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుసుకొని ఇకనైనా మసలుకోగలమన్న భావాన్ని నర్మగర్భంగా ప్రకటించేందుకు ప్రయత్నించారు. అంతేకాక కాలాన్ని జారవిడుచుకోవడం వలన జరిగిన నష్టాన్ని తెలియజెప్పేందుకు శిల్పంగా మారవలసిన నేను శిలగా మిగిలిపోయానని వాపోయారు. మున్ముందైనా చేతులు కాలకుండా ఉండేందుకు ఓ జ్ఞాన పుష్పం మనోసరస్సులో వికసించిందనీ గుణపాఠ కిరణాల తాకిడితో నేడు కాలం విలువ తెలుసుకోగలిగానన్న అర్థం వచ్చేలా కవయిత్రి తమ భావాలను చక్కగా ప్రకటించారు. జ్ఞానపుష్పం..మనోసరస్సు.. గుణపాఠ కిరణాల తాకిడి వంటి పదాలు కవితలో ఇట్టే ఒదిగిపోయి కవితకు పుష్టినిచ్చాయి.

కాలం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్నాక భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలతో వర్తమానంలో గల మిగిలిన క్షణాలతోనైనా అందమైన పందిరి నిర్మించుకుంటాననీ తెలుపడం బాగుంది. తనకు తానే కాలం యొక్క ప్రతి గడియను ఒడిసిపట్టుకుని నిరంతరంగా పరుగులు తీసేలా ప్రణాళికను సృష్టించుకుంటానని తెలియజెప్పారు. అందుకోసం కాలాన్ని నిద్రపోనివ్వకుండా నేనూ నిద్రపోనని ప్రకటించారు. విజయతీరాలను తాకేందుకు పడిలేచే కెరటాన్నవుతానంటూ కన్ని ముగింపు నిచ్చారు. అభివ్యక్తి శిల్పం వంటి విషయాలలో మరింత శ్రద్ధచూపి శ్రీదేవి గారు మున్ముందు గాఢమైన కవిత్వాన్ని అందించగలరని ఆశిద్దాం.

కాలంతో నేస్తం

బిగించిన పిడికిలితో
కనులు తెరచిన గడియ నుంచే..
ఏదో సాధించాలన్న కాంక్ష సాక్షిగా.
కదిలే కాలంతో నేస్తం పట్టాక
కుదురుపడని ప్రతి మనసులో
ఏదో నిరంతరం జరిగే పోరాటం..
కనురెప్పల సవ్వడిలో దాగిన
స్వప్నాలకు రెక్కలు తొడిగి
ఆనందపు గగనంలో
స్వేచ్ఛా విహారం చేయాలని
ఉవ్విల్లూరే ప్రతి మది ఆరాటం
ఆరాట పోరాటాలని
శ్వాసగా మార్చుకుంటూ
విశ్రాంతిని విరామ చిహ్నంగా
మలచుకుంటూ
కాలాన్ని నిద్రపోనివ్వక
కలల సాకారానికి కదులు
నడకో..పరుగో..
కదలడం మానకు
ఎందుకంటే
పుట్టుక నీ చేతుల్లో లేకపోయినా
పుడకల్లోకి మాత్రం
పరాజితుడుగా చేరకు

-విజయలక్ష్మి నాగరాజ్
9966559567

కరీంనగర్ కు చెందిన కవయిత్రి విజయలక్ష్మి నాగరాజ్ గారు కాలాన్ని నిద్రపోనివ్వను అంశంపై కాలంతో నేస్తం శీర్షికతో రాసిన కవిత ద్వారా కాలాన్ని నిద్రపోనివ్వక కలల సాకారానికి కదులుమంటూ సందేశాన్నందించేందుకు ప్రయత్నించారు. పుట్టుక నీ చేతుల్లో లేకపోయినా... పుడకల్లో మాత్రం పరాజితుడుగా చేరకు అని హితవు పలికారు. పుట్టుకనుండి గిట్టే వరకు మధ్య జరిగే జీవితమనే తాత్కాలిక ప్రయాణంలో కాలం విలువ తెలుసుకుని మసలుకోవాలని కోరుతూ కవయిత్రి విజయలక్ష్మిగారు తమ కవితను కొనసాగించారు.

బిగించిన పిడికిలితో కనులు తెరచిన గడియనుంచే ఏదో సాధించాలన్న కాంక్ష సాక్షిగా.. అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. నిజమేకదా! పుట్టుకతోనే పిడికిలి బిగించి ఏదో సాధించాలన్న సంకేతాన్ని తెలియకుండానే అందిస్తాం కదా! కదిలే కాలంతో జతకట్టాక కుదురుపడని ప్రతి మనసులో ఏదో నిరంతరం జరిగే పోరాటం అంటూ అంశానికి కాస్తంత బలాన్ని కూర్చేందుకు ప్రయత్నించారు. కనురెప్పల సవ్వడిలో దాగిన స్వప్నాలకు రెక్కలు తొడిగి ఆనందపు గగనంలో స్వేచ్ఛా విహారం చేయాలని

ఉవ్విల్లూరే మది ఆరాటం అంటూ కొనసాగించడం బాగుంది. మనసులో నిరంతరం జరిగే పోరాటాన్ని స్వేచ్ఛా విహారం చేయాలన్న మది ఆరాటాన్ని సమన్వయ పరచుకొని కాలాన్ని ఎలా అనుకూలంగా తీర్చిదిద్దుకుని ప్రయోజనం సాధించాలో..తెలుపడానికి, ఆ ఆరాట పోరాటాలను శ్వాసగా మార్చుకుంటూ విశ్రాంతిని విరామచిహ్నంగా మలచుకుంటానని చెప్పడం సమంజసంగా ఉంది. శిల్పం విషయంలో కవయిత్రి విజయలక్ష్మి గారు చూపిన చతురత ప్రశంసనీయంగా ఉంది. కనురెప్పల సవ్వడి.. స్వప్నాలకు రెక్కలు.. ఆనందపు గగనం.. ఆరాట పోరాటాలను శ్వాసగా మార్చుకుంటూ... వంటి పదబంధాల ప్రయోగంలో కవయిత్రి ఔచిత్యాన్ని పాటించారు. అభివ్యక్తిలో నవ్యతను గమనిస్తాం. కాలాన్ని నిద్రపోనివ్వక కలల సాకారానికి కదలడం ఆపవద్దని హితవు పలికారు. కాలం యొక్క గొప్పతనాన్ని.. దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో కవితాత్మకంగా వివరించేందుకు ప్రయత్నించారు. మున్ముందు మరింత బలమైన కవిత్వం ఆమె కలం నుండి జాలువారాలని కోరుకుందాం.

నిద్ర బుచ్చలేరు

గడసరి కాలం
గమనమాపని గడియారం
త్వరపడక అడుగులు తడబడినా
తోసేసి తొలుత వెళ్ళు తుంటరి ఒంటరికాలం.
కష్టాలు నష్టాలు కబలించినా
సుఖాలు లాభాలు కలిసి రాకున్నా
కాలం కలిసి రావడం లేదని నిందిస్తూ
నిద్రబోయే నిర్భాగ్యులెందరో.
ఉత్తరుని ప్రగల్భాలవలె
ఉర్విపికి ఉత్తరమీయలేను
ఉరికే కాలవేగముతో పోటీపడక
ఊరక గడియైనా ఉండను.
విశ్రాంతిని వరించిన కాలచక్రంతో
చమటోడ్చయినా చక్కని విజయాలు సాధిస్తా
విశ్వంలో నా కీర్తి ఉండేటట్టు
కాలంతో పాటు కదులుతా
కాలమును ఒడిసి పట్టు బలభీములెవరు
నిద్ర పోనీయని నిగ్రహోరు లెవరు
వివేకమున కాలవిజేతలౌదురు గాని
విశ్రాంతికి గోరి కాలమును నిద్రబుచ్చలేరు

-చిలుక భాస్కర్
9618557547

సికింద్రాబాద్ బోడుప్పల్ కు చెందిన కవి చిలుక భాస్కర్ గారు కాలాన్ని నిద్రపోనివ్వను అంశంపై నిద్ర బుచ్చలేరు శీర్షికతో రాసిన కవితలో కాలాన్ని ఆపే శక్తి ఎవ్వరికీ లేదన్న జీవన సత్యాన్ని తెల్పిచెప్పారు. సరళత్వానికి పెద్దపీటవేస్తూ అలతి అలతి పదాలతో కవితా వస్తువును కవితామయం చేయడానికి ప్రయత్నించారు. ప్రయోగింపబడిన పదబంధాలన్నీ మామూలుగా కనిపించినప్పటికీ కొన్నైనా చిక్కని భావాలను ప్రకటించడానికి ఉపయోగపడినాయి. అభివ్యక్తిలో పెద్దగా నవ్యత లేకపోయినప్పటికీ అంశానికి బలం చేకూరే విధంగా కాస్తంతయినా కృషిచేశారు. కాలం యొక్క ప్రాశస్త్యాన్ని .. తెలుసుకుని వివేకాన్ని ప్రదర్శిస్తూ.. కాలాన్ని జయించాలే తప్ప విశ్రాంతి నొందుతూ కాలాన్ని వృధా చేయడం ద్వారా కాలాన్ని నిద్ర పుచ్చడం సాధ్యం కాదన్న సంగతిని కవి చిలుక భాస్కర్ గారు తమ కవిత ద్వారా ఓ మంచి సందేశాన్ని ఇవ్వడంలో సఫలీకృతులైనారు.

కవిత ఎత్తుగడలోనే కాలం గడసరిదని.. గమనం ఆపని గడియారం వంటిదని.. దానికి అనుగుణంగా అడగులు వేయకపోతే.. అది మనలను తోసేసి పరుగులు తీసే తుంటరిదని కాలాన్ని ప్రారంభపంక్తుల్లోనే విడమరచి వివరించారు. కాలం ఎవరికోసమూ ఆగదన్న అర్థం ధ్వనించేలా కవిత ఎత్తుగడను తీర్చిదిద్దారు. కాలం విలువను గుర్తించక నిద్రపోయే కొందరు నిర్భాగ్యులు తమను అప్పుడప్పుడు కష్టాలు నష్టాలు కబలించినా మరికొన్ని సార్లు సుఖాలు.. లాభాలు కలిసిరాకున్నా తప్పు కాలంపై నెట్టడం భావ్యం కాదని కవి భాస్కర్ గారు అభిప్రాయపడ్డారు.

ఉత్తరుని ప్రగల్భాలవలె.. ఉర్విపికి ఉత్తరమీయలేను.. ఉరికే కాలవేగంతో పోటీపడక ఊరక గడియైనా ఉండలేను అంటూ భాస్కర్ గారు కొనసాగించిన తీరు బాగుంది. విశ్రాంతిని వరించిన కాలచక్రంతో చెమటోడ్చయినా చక్కని విజయాలు సాధించాలని హితవుపలికారు. పదిమంది మెచ్చేలా కాలంతో పోటీపడి కదలాలని పిలుపునిచ్చారు.

కాలాన్ని ఆపడం ఎవరితరం కాదని, వివేకంతో జయించి విజయతీరాలను చేరాలని సూచించారు. అక్కడక్కడ పదబంధ ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటించకపోయినప్పటికీ కవిత్వాంశ ఆశించినంత లేకపోయినప్పటికీ కవితావస్తువు వెలుగులో కొన్ని మంచి మంచి విషయాలనైనా ప్రస్తావించడం ప్రశంసనీయం. విస్తృత అధ్యయనం ద్వారా కవి భాస్కర్ గారు తమ కలానికి మరింత పదును పెట్టుకుంటారని ఆశిద్దాం.

నానీలు

ఒక్క చినుకుచాలు
విత్తనానికి
ఒక్క అడుగు చాలు
విజయానికి

కనురెప్పలు
దాటింది కన్నీటి చుక్క
మరుక్షణమే
మనసు కడిగిన ముత్యం.

ఎన్నికల
నగారా మోగింది
ఊసర వెల్లులు
వరుస కట్టాయి

-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

"నేనెప్పటికైనా అలా అత్యున్నత స్థాయిని అందుకోగలనా? ఈ పరిస్థితికి కారణం ఏమిటి? ఏమో ఏం అర్థం కావడం లేదు". ఆలోచనలతో ఎంతో చిరాగ్గా ఉంది సాహిత్యకు.

సాహిత్య ఒక పెద్ద ఇంగ్లీషు మీడియం స్కూల్లో పదవ తరగతి చదువుతోంది. చాలా తెలివైన అమ్మాయి. చదువులోనే కాక ఆటల్లో కూడా ముందుంటుంది. ఎప్పటిలాగే ఆ రోజు కూడా హుషారుగా స్కూలుకు వెళ్ళింది. కాని ఆ రోజు పాఠం తనకు నచ్చలేదు. స్కూల్లో ఆఖరి గంట మోగేసరికి విసుగు పెరిగింది.

సాహిత్య ఇంటికి బయలు దేరింది. వాతావరణం మారింది. ఆకాశం మబ్బులతో చీకట్లు కమ్మింది. వాన పడితే బాగుండు అని ఎప్పుడు ఎదురు చూసే సాహిత్యకు ఆ రోజు తన భవిష్యత్తును ఆ చీకటితో పోల్చుకుని భయపడింది.

టీనేజీ పిల్లలలో మామూలుగానే ఆలోచనలు ఎక్కువ. తనకున్న భయం వయసుతో కలిసి కొండంతంగా కనిపిస్తుంది. అదే దిగులుతోనే అసహనంగా ఇల్లు చేరింది.

గుమ్మంలో అమ్మ వందన ఎదురొచ్చి "సాహిత్యా, ఈ రోజు నీకిష్టమైన ఉల్లి పకోడీ చేశాను. వర్షం పడేలా ఉంది, తొందరగా స్నానం చేసొచ్చి వానను ఆస్వాదిస్తూ లాగించేసేయ్" అంది.

"నాకేమొద్దమ్మా" అంటూ నీరసంగా గదిలోకెళ్ళింది సాహిత్య.

వందనకు ఆశ్చర్యమేసింది. ఎప్పుడూ నవ్వుతూ సందడి చేసే పిల్లకి ఏమైంది. ఒంట్లో ఏమైన బాగలేదా ? స్కూల్లో ఏదైన గొడవయ్యింటుందా ? లేదంటే వచ్చే దారిలో ఏ తుంటరి పిల్లలైనా అల్లరి చేశారా? మెల్లిగా అడగాలి అనుకుంటూ వంటగదిలోకెళ్ళి ఒక ప్లేటులో పకోడి తీసుకొని సాహిత్య గదిలోకి వెళ్లింది తల్లి వందన. .

బయట మబ్బు కారణంగా గది కాస్త చీకటిగా ఉంది . వందన లైటు వేసింది. సాహిత్య స్నానం చేసి మంచం మీద మౌనంగా కూర్చుంది. వందన కూతురు దగ్గరికి వెళ్ళి పకోడి ప్లేటు చేతికందిస్తూ...

"ఏమైందమ్మా? ఏదైనా సమస్యా? అమ్మతో చెప్పకూడదా?" అంటూ తన మనసులో ఉన్న దిగులును తెలుసుకునే ప్రయత్నం చేసింది.

"అమ్మా! సమానత్వం అంటే ఏమిటి?" అడిగింది సాహిత్య.

దానికి వందన ...

"సమానత్వం అంటే అంతా ఒకటే. జాతి, కులం, మతం, మగ, ఆడ అనే తేడా లేకుండా అందరికి సరి సమానమైన అవకాశాలు, గౌరవాలు ఉండాలనే లక్ష్యం.. అదొక ఆదర్శ భావన".

" అంటే ఇది కేవలం భావనేనా, నిజం కాదా?" ప్రశ్నించింది సాహిత్య.

"అయ్యో ఎందుకు కాదు. ఇది నూరు శాతం నిజం" జవాబిచ్చింది వందన.

"మరి బయట ఆడ, మగా సమానంగానే ఉన్నారా" అరచినట్టుగా అడిగింది సాహిత్య.

"అవునమ్మా మునుపటిలా కాకుండా ఇప్పుడు ఆడపిల్లలు, మగపిల్లలు అంతా చదువుకుంటున్నారు, అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు. అన్ని రంగాల్లో పని చేస్తున్నారు కదా?" అని బదులిచ్చింది వందన.

అప్పుడు సాహిత్య కాస్త కోపంగా ...

"పనిచేస్తున్నారు! కానీ ఎంత శాతం? చిన్న ఉద్యోగాల్లో బాయ్స్ కు గరల్స్ కు మధ్య చిన్న తేడా ! పెద్ద ఉద్యోగాల్లో పెద్ద తేడా! " అంది.

చదువుకునే వయసులో ఉద్యోగాల గురించి, సమానత్వం గురించి ఎందుకాలోచిస్తుంది ఈ అమ్మాయి అని మనసులో అనుకుంటోంది వందన. పూర్తి విషయం కనుక్కోవాలని –

"అసలు ఏం జరిగింది? ఎందుకిదంతా మాట్లాడుతున్నావు" అని కూతుర్ని నిలదీసింది తల్లి.

"అమ్మా ! ఈ రోజు మా టీచరు సమానత్వం గురించి పాఠం చెప్పింది. తర్వాత దాని మీద చర్చ జరిగింది. స్కూల్లో, కాలేజీల్లో, మగపిల్లల్లో దాదాపు సరిసమానంగా ఆడపిల్లలుంటారు. కానీ అదే అత్యున్నత స్థాయి పదవుల్లో ఆడపిల్లలు అరకొరగా ఎందుకుంటున్నారు?" అని టీచరు ప్రశ్నించింది.

" అప్పుడు మా క్లాస్ నేట్ రాజేష్ నిలబడి, "అరకొరగా ఎందుకున్నారు? అమ్మాయిలు చాలా వరకు ఉద్యోగాలు చేస్తున్నారు టీచర్" అని బదులిచ్చాడు.

అప్పుడు టీచర్ ఎదురు ప్రశ్న వేసింది "ఉద్యోగాలు చేస్తున్నారు, కానీ ఎంత శాతం? ఇప్పటి వరకు మన ప్రధాన మంత్రుల్లో ఎంత మంది ఆడవాళ్ళున్నారు ? ఒక్కరే, ! దేశ అధ్యక్షుడి పదవిలో – ఒక్కరే,! మన సుప్రీం కోర్ట్ జడ్జీలు 34 మంది ఉంటే, అందులో ఇద్దరే ఆడవాళ్ళు. ఇలా ఎందుకు? కాలేజీ చదువులు అయిపోయే వరకు ఎంతో పోటీతత్వంతో చదివే ఆడపిల్లలు, ఇలాంటి పదవులకు పోటీ ఎందుకులేక పోతున్నారు?"

టీచర్ అలా అడగడం తో..తరగతి గదంతా నిశ్శబ్దంగా ఉండి పోయింది. ఎవరూ నోరు విప్పలేదు. అప్పుడు నా స్నేహితురాలు శైలు నిలబడి "టీచర్, దీనికి కారణం తెలుసుకోవాలనుంది కాస్త వివరించరూ " అనడిగింది .

టీచర్ యిలా చెప్పుకుంటూ వచ్చింది.

" ఈ పరిస్థితికి కారణాలు చాలానే ఉన్నాయి. మె?ట్ట మొదట ఆడపిల్లల పట్ల తల్లి దండ్రుల వివక్ష. మగ పిల్లలకు లేని కట్టుబాట్లు, నూరిపోసే భయాలు. టెంత్ ఇంటర్ కాగానే ఎంత బాగా మార్కులు వచ్చినా పెళ్లి చేయాలనుకోవడం. మగపిల్లలకు తక్కు మార్కులు వచ్చినా డొనేషన్ కట్టి చదివించడం. ఇంటి పని మగ పిల్లలకేమీ చెప్పకుండా ఆడపిల్లలకే చెప్పడం. ఇలా

ఆడపిల్లలకు ఇంటి బాధ్యతలెక్కువ , పెళ్ళిల్లయ్యాక వాళ్ళకు బయటి ప్రపంచం కంటే ఇల్లు చూసుకోవడమే ముఖ్యమస్తుంది. మనది పురుషాధిక్య దేశమే కావున ఆడవాళ్ళ చేతికింద పని చేయడం నామోషి గా భావిస్తూ అత్యున్నతస్థానాలకు ఎదగనీయకపోవడం. ఆడవాల్ల సామర్థ్యాన్ని గుర్తించ నిరాకరించడం. చిన్నచూపు చూడడం. ఆడవాల్లు బలహీనులని కించపరచడం. ఎదిగేక్రమంలో మగవాళ్ళు ఆడవాళ్ళకు మద్దతునివ్వకపోవడం . సినిమాల్లో ఆడవాల్లను కించ పరుస్తూ మగ వాల్లు హీరోలన్నట్టు చూపడం. ఇట్లా ఎన్నో కారణాలు " అంటూ క్లాసు ముగించింది టీచర్. "

" మగ పిల్లలు మేమే గ్రేట్ అన్నట్టు చప్పట్లు కొట్టడం మాకు మరింత అవమానంగా అనిపించింది. అమ్మా ! అదివిన్నప్పటి నుంచి నాకు మనసంతా ఎట్లనో అయిపోయింది.

నేనెంత కష్టపడి చదివినా, నీలాగే ఇంటికే పరిమితమవుతానా? ఒకవేళ కష్టపడి బయటకొచ్చినా, ఈ స్వార్థపరులు నన్ను ఎదగనివ్వరా ? నా కలలన్ని వృథాయేనా" అంటూ తెలిసి తెలియని వయసు కావడంతో ఎంతో దిగులుగా అడిగింది సాహిత్య.

పెద్ద ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. ఈదురు గాలులకు కిటికీలు, డోర్లు కొట్టుకుంటున్నాయి. వందన ఆ శబ్దానికి బయటకొచ్చింది.

బయట చప్పుళ్లకంటే తన గుండె చప్పుడే ఎక్కువగా వినిపిస్తోంది వందనకు. నిజంగానే తన కూతురు చెప్పింది సత్యమే కదా అనిపించింది. ఇంటినీ, పిల్లలనీ ఆడవాళ్ళకు అంటగట్టి వాళ్ళను ముందుకెళ్ళకుండా చేశారు ఈ మగ మహారాజులు. బి.టెక్ వరకు చదివి యూనివర్సిటీ టాపర్గా నిలిచిన నాకు డిగ్రీ చదివిన అబ్బాయితో పెళ్ళి చేసి, మా నాన్న మావారు వాళ్ళ మాటలతో, సంప్రదాయం ముసుగుతో, పరువు పేరుతో మంచి ఉద్యోగంలో స్థిరపడాలన్న నా కోరికను నామరూపాల్లేకుండా వేర్లతో సహా పెకిలించేశారు. వందనలో ఏదో ఘర్షణ. తన చదువు చాలని పెళ్లి చేయడం, వెంట వెంట పిల్లలు పుట్టడం . వారి ఆలన పాలన. అత్తమామలు. భర్త అందరి బరువులు బాధ్యతలకు జీవితం పరిమితమై పోయింది.

ఎంత జోరుగా వర్షం పడుతుందో అంతే వేగంగా వందన మనసులో ఎన్నో ఆలోచనలు తిరుగుతున్నాయి. ఎంతో ఆందోళనగా అనిపించింది. కాసేపటికి ఒక్కసారిగా వర్షం ఆగిపోయింది. ఆలోచనలతో సతమతమవుతున్న వందనకి కిటికీల్లోంచి చల్లగాలి తగిలింది. ఆ హాయైన గాలి తాకిడికి, ఈ లోకంలోకొచ్చి బయట ఆకాశాన్ని చూసింది. ఎంత నిర్మలంగా ఉంధీ వాతావరణం. ఊరికే ఆలోచించడం సరికాదు ఏదైనా సాధించాలి అనిపించింది.

ముందు తన కూతురి మనసులో బాదను పోగొట్టాలని గదిలోకి పెళ్ళింది.

" సాహిత్యా! ఎందుకు దిగులు పడుతున్నావు. మార్పు ఒక్కసారిగా రాదని తెలుసుకో! ప్రయత్నంతో ఏదైనా సాధ్యపడుతుందని గ్రహించు". అంది వందన.

"అంటే ఏంటమ్మా" అడిగింది సాహిత్య.

దానికి వందన–

"చూడు సాహిత్యా! మీ పాఠ్య రూపకంగా ? నీకు వివరిస్తాను – బ్రిటీషు వారు మన దేశాన్ని ఆక్రమించుకోవడానికి, రెండు, మూడు వందలేండ్లు పట్టింది. . మన భారత దేశం స్వతంత్రం సాధించడానికి కూడా దాదాపు తొంభయ్యేళ్లు పట్టింది. అప్పటి రోజులలో ఆడవాళ్ళు కనీసం బయట గుమ్మాన్ని చూసెరుగరు. తర్వాత, కాలంతో పాటు మార్పొచ్చింది. చదువు మార్పుని తీసుకొస్తుంది."

" మా అమ్మమ్మ, మా తాతతో ఎప్పుడూ తలెత్తి మాట్లాడలేదు. మా అమ్మ అవసరం వరకు మా నాన్నతో కాస్త మాట్లాడేది. నేను మీ నాన్న అన్ని విషయాలు చర్చించుకుంటాం. ఇప్పుడు ఆడవాళ్ళు అన్ని రంగాల్లో ఉన్నారు. వాళ్ళు చేయలేని పని ఏదీ లేదని నిరూపించారు. డెబ్బై నాలుగు ఏళ్ళ మన స్వతంత్ర దేశంలో మన రాజ్యాంగం మనకెన్నో హక్కుల్ని కల్పించి, ఆడవాళ్ళను ముందుకు నడిపిస్తోంది. క్రమేపి ఇంకొన్ని సంవత్సరాల్లో ఈ వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇదంతా పట్టుదలతో చదివితేనే సాధ్య పడుతుంది. ఏమి తెలియని కాలంలోనే రాణి రుద్రమదేవి వంటి వాల్లు ఆడవాళ్ళు రాజ్యాలేలారు. ఇప్పుడు ఎంతో అవగాహన ఉంది. ఒక పదవికి నువ్వు పోటీగా నిలబడితే నిన్ను కాదనే హక్కు ఎవరికీ లేదు. ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే – అనుకున్నది సాధించే వరకు పట్టుదల వదల కూడదు. అందరూ కష్టపడితే రానున్న రోజుల లో మార్పు తథ్యం. నేను కూడ పార్ట్ టైం జాబ్ వెతుక్కుంట. నా చదువు వృథా కానివ్వను. నా చదువు మీకే కాకుండ సమాజానికి ఉపయోగ పడాలి. " కృత విశ్చయంతో అంది వందన.

ఆ మాటలతో సాహిత్య ఎంతో తేలికపడింది. అందరూ తన లాగే దిగులు పడి ఇక్కడే ఆగిపోతే ఎప్పటికీ ముందుకు వెళ్ళలేమని తెలుసుకుంది. ఇంకా ఆందోళన పెట్టుకోకుండా చక్కగా చదువుకొని తాను అనుకున్న తారా స్థాయికి చేరుకోవాలని గట్టిగా నిర్ణయించుకుంది.

తన కూతురు ముఖంలోని మార్పులను గమనిస్తున్న వందన కూడా కాస్త కుదుట పడి హాల్లోకి వచ్చి ఇంక తనుకూడ ఉద్యోగానికి వెళ్ళి దేశ పురోగతికి తన వంతు బాధ్యత నిర్వర్తించాలని భావించింది.

ఈ లోగా సాహిత్య హాల్లోకి వచ్చి, "అమ్మా! డాబా మీదకెళ్ళి చల్ల గాలిలో పకోడీ తినేసి వస్తా" అని చెప్తూ తుర్రుమంది. తన కూతురి హుషారు చూస్తూ మురిసిపోయింది వందన.

-స్వప్న ప్రియ
సెల్: 8885995945

పుస్తక సమీక్ష

దాశరథి రచనా సంకలనం

తెలుగు సాహిత్యంలో ధృవతారగా నిలిచిపోయే తెలంగాణ ప్రాంతపు రచయితగా శ్రీ దాశరథి కృష్ణమాచారిని (1925-1987) పేర్కొనవచ్చును. పద్యం గద్యం అనువాదం వ్యాసం, నాటకం, నవల కద, కథానిక, సినిమా పాటలు– అన్నింటా తన ప్రతిభను 'రూఢి' పరుచుకున్న రచయిత. నిజాము నవాబు తుపాకీ గుళ్ళకు ధైర్యంగా ఎదురు నిలిచి రొమ్ము చూపిన ధీశాలి. కారాగార శిక్ష వల్ల కూడా Compromise కాని నిశ్చలచిత్తుడు. తన 32 రచనలు/ అనువాదాలతో సాహిత్య చరిత్రలో స్థిరంగా నిలిచిపోయాడు. శ్రీశ్రీలాంటి దిగ్గజాలను సైతం ముఖాముఖి ఎదుర్కొన్నారు. మహాకవి, అభ్యుదయ కవిచక్రవర్తి కళా ప్రపూర్ణలాంటి బిరుదులు ఈయన చిరునామా.

22-7-2015న వీరి91వ జయంతి పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి సికింద్రాబాద్‌వారు నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత పుస్తకం, గంటా జలంధరరెడ్డి సంపాదకత్వాన వెలువడింది. నిప్పుపూలు, రక్తాంజలి, వెన్నెల్లో చీకటి మరియు బదరి అను నాలుగు కథలు ఈ కథలపై ప్రముఖ సాహితీవేత్త డా॥ అమ్మంగి వేణుగోపాల్ వెలిబుచ్చిన అభిప్రాయాలను ఇచ్చారు. మహాబోధి, మహాపరినిర్వాణము మహాశ్వేత మరియు త్యాగజ్వాల అను నాలుగు నాటికలు కూడా సంకలనంలో చేర్చబడ్డాయి. ఆయన ఆల్బంలోని ఫోటోలు, రచనలు జీవితంలోని ముఖ్య ఘట్టాలను అనుబంధంగా ఇచ్చారు సంపాదకులు. "కథ"ను గూర్చి దాశరది వ్రాసిన వ్యాసం ఈ సంకలనానికే 'హైలెట్' అని చెప్పవచ్చును. సమాజపు ఆర్యోగం కోసం మంచి కథలు రావాలంటూ దాశరథిగారు ఇలా అంటారు. "కథలు శాంతికి భంగం కలిగించకూడదు. లైంగిక అరాచకం బోధించకూడదు. రచయిత సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలని కోరుతూ కథలు రాయాలి". అందరూ అర్థం చేసుకునే భాషలో కథలుండాలంటారు. ఎవరికి తగిన సిద్ధాంతాలు వారికున్నా, సమాజాన్ని కలుషితం చేయకూడదంటారు.

'నిప్పుపూలు' కథ నిజాము రాష్ట్ర విలీనాంతర పరిస్థితులను వివరిస్తుంది. హైదరాబాద్‌లో రాణిలా జీవిస్తోన్న బేగం సాహెబా తమ జాగీర్ల సంరక్షణార్థం ఆ పల్లెటూరికి వస్తుంది. గౌరీ అనే బంజారా యువతి, కట్టుబొట్టు, మాటకు ముగ్ధురాలై తన దుస్తుల్ని బహూకరిస్తుంది. గౌరి తిరస్కరిస్తుంది. కథకుడు బేగంను నాజూకుగా బంగళాల్లో కనిపించే తంగేడు పూలతో, గౌరిని అడవిలో పూచి స్వేచ్ఛతో ప్రకాశించే మోదుగు పూలుగా పోల్చడం కవిలోని కవితాత్వకత.



రెండవ కథ 'రక్తాంజలి' దాశరథిగారి నిజామాబాదు జైలు జీవితం ప్రతిబింబించేదిగా వ్రాయబడింది. కథ చివరన నిజాంరాజు ఓటమి రాబోయే కాలానికి ప్రతీకగా చిత్రించారు దాశరథి బదరి కథలో. తల్లివయసున్న వదిన, బదరికి చెప్పే కథలులో మనో వైజ్ఞానికం ద్యోతకమవుతుంది. ఆనాటి పాశ్చాత్య మనో విశ్లేషకులు–ఫ్రాయిడ్‌లాంటి వారు వివరించిన సూత్రాలతో దాశరథి ప్రభావితుడయినట్లు కనిపిస్తుంది.

రచయితన్నవాడు నాటికలు తప్పకుండా వ్రాయాలి అన్న భావం బలంగా నాటుకున్న ఆ రోజుల కనుగుణంగా వ్రాయబడినట్లు అవుపిస్తుంది. శాంతి, ధర్మం, ఈ రెంటికి శరణు అన్న భావం ప్రస్ఫుటమవుతాయి నాటకాల్లో.

గాంధీజీ సిద్ధాంతాలకు ఆనాటి యువకోటి ప్రభావితమయింది. ఎందరో తమ జీవితాల్నే త్యాగం చేసారు. వీరిలో దాశరథి కూడా ఒకరు. అందుకే సంకలనంలోని 4 నాటికలు శాంతి అహింసలను ప్రబోధిస్తాయి. తెలంగాణా భాషా సాంస్కృతిక మండలికి వేవేల జేజేలు.

ప్రతులకు: డా॥గంట

తెలుసుకో

ప్రేమా
ఓ ఆకర్షణ సహజం
ప్రేమా వేరు
ఆకర్షణ వేరు నేస్తం
నరజాతి చరిత్ర
సమస్తం
పరపీడన పరాయణత్వ
మంటాడో కవి!
ఆకర్షణ తాత్కాలికం
ప్రేమంటే
ఓర్పు, నమ్మకం
త్యాగం, వివేకం
నేస్తం
ఈవాస్తవం తెల్సుకో
వివేకంతో మసలుకో
అప్పుడు
గగనంలో
విజయకేతనం ఎగరేస్తావ్
ప్రేమికుడివై రాణిస్తావ్
నీ ప్రేమను సాధిస్తావ్ నేస్తం.

– సత్యం
సెల్: 9100495714

దేవుడు.. మానవుడు

పరచుకున్న పర్వత సానువుల మౌన ముద్రల్లో
కారు మబ్బులు మోసుకొచ్చే నీటి మూటల్లో

ఒక్క క్షణమాగక దిక్కు దిక్కుకు సాగే గాలి తరగల్లో
ఎక్కడున్నా లెక్కగా విచ్చుకునే పూల సొగసుల్లో

పచ్చని చెట్ల ఆకుల అలవోక కదలికల్లో
వెచ్చని గూళ్ళ పరవశించే పక్షుల కువకువల్లో

పెరుగుతూ తరుగుతూ గమించే శీతతాపాల్లో
పేరుతోనే నోరూరించే పండ్ల తియ్యదనాల్లో

శాంతిమంత్రం పఠించే లోయల అగాదాల్లో
కాంతి పుంజాల్లా మెరిసే వెన్నెల తిన్నెల్లో

బేలగ చూసే సాధుజంతువుల కళ్ళల్లో
మాలగతోచే కీటకాల బారుల్లో

మాయామర్మ మెరుగని అద్దమంటి మనసుల్లో
దయామయుల ఆర్ద్ర హృదయాగారాల్లో

వికలమైన గుండెల్ని ఓదార్చే గాఢాలింగనాల్లో
ఆకలిగొన్న వానికి వడ్డించిన అన్నకణాల్లో

అనుక్షణం దర్శనమిస్తూ.. సాంత్వన పరుస్తూ

తలపుల కొమ్మలెన్నున్నా ఏకైక అంతరంగ వృక్షం
జలజలపారే నదులన్నీ చేరే గమ్యపు సంద్రం

రూపునేరీతి ఊహించినా అన్ని ధర్మాల అంతస్సూత్రం
చూపునే మార్చే భ్రమల పొరల్లోపలి మూలకేంద్రకం
తానేనని.. చెబుతూ వస్తున్నాడు.. అనాదిగా దేవుడు!
అయినా..
తనవైన కుశంకల్ని వీడకున్నాడు.. నేటికీ మానవుడు!

– ఎస్. కాశింబి
సెల్: 9052216044

జీవితం

దేవుడు మనకు
జీవితాన్ని
బహుకరించాడు
కానీ మనం
కీర్తి కనకం
వెంటవెళ్లాము.
ఇంకా మనరోజులు
పొడిగించాలని
అడుగుతూనే
ఉన్నాము.
ఈ ప్రేత వస్త్రం
ఈ మృతదేహం
ఈ సమాధి
ఇవన్నీ కేవలం
మాటలు మాత్రమే.
మనిషిని
గుర్తు చేసుకునే
వాళ్లు లేని రోజున
మనం జీవించి లేనట్లే.
సముద్రం కూడా
మనలాగే
స్వార్థంతో నిండింది.
బ్రతికుంటే
ఈదనివ్వదు
చచ్చి పోయాక
మునిగిపోనివ్వదు .
ఇంక ప్రపంచం
గురించి ఏమి
మాట్లాడుదాము
ఒకొక్కరికి
ఒక కథ ఉంది.
ఎదురుగా
ఉన్నవాడిని
చెడ్డవాడు
అంటారు
కనబడని వాడిని
దేవుడంటారు

–అరుణ డేనియల్
9000606889

అమ్మ

తన బిడ్డకోసం రెండవజన్మ ఎత్తుతుంది అమ్మ
తనకంటూ అన్ని మరచే త్యాగశీలి అమ్మ
అడుగు అడుగుకి తన హృదయం పరిచే నేస్తం అమ్మ
మన నవ్వుల్లో తన సంతోషాన్ని వెతుక్కునే ఓ బాటసారి అమ్మ
వెన్నెలంత చల్లనిది వెలుగులు నింపె మనసు తొ
మల్లెలంత స్వచ్ఛమైన పరిమళించే జోలపాట నీకే సొంతం అమ్మ
దేవాలయం అంత పవిత్రమైన ఆవరణ నీఒడి అమ్మ...
భూదేవి అంత ఓర్పు, నేర్పు నీఆభరణం అమ్మ...
ఎన్నని చెప్పను అమ్మ అనంతమైన సాగరం నీప్రేమలొ ఓలలాడి...
అమ్మకు అమ్మనై నీ రుణం తీర్చుకొనా అమ్మ.

–పి.విశాలాక్షి
9908435805

ఆయువు...

ప్రాణవాయువు అందక
ఆయువును విడుస్తున్నావ్.
తల్లి లాంటి తరువును నరికి
నరకానికి వెళుతున్నావ్.
భూగ్రహం చుట్టు
కాలుష్యాన్ని నింపి
నీకు నువ్వే చితి మంటలు
ఎక్కుతున్నావ్.
పచ్చగా వుండే ప్రకృతిని
పగబట్టి పాడు చేస్తున్నావ్.
నీ గోతిని నువ్వే తవ్వుకుంటున్నావ్.
ఆరుగాలం పండే పంటలను
పాడుజేసి...
అందనంత మేడలు కట్టి...
రియల్ఎస్టేట్ పేరిట
భూబకాసురుడివై
నీ జిందగీని నువ్వే
పాడుచేసుకుంటున్నావ్.
చిలుక పక్షుల పలుకులేవి..?
కోకిలమ్మల రాగాలేవి...?
మయూరాల నాట్యాలేవి...?
పిచ్చుకల గుసగుసలేవి...?
లేగదూడల దుంకుల్లేవి...?
చెట్టుపుట్టల సంగతేమి...?
అన్నింటిని రూపుమాపి
నీ నిజరూపాన్ని మార్చుకొని
ఏమార్చుకొని...
గతి తప్పిన బుద్ధితో
గొయ్యిలో పడుతున్నావ్.
ఒక్క బెడ్డు కోసం
ఆక్సిజన్ బుద్ధికోసం
సగం సచ్చిన శవానివై
హరిగోసలు పడుతున్నావ్.
శ్వాసలన్ని బందీ అయిపోయి
నలుగురు దరి చేరని బతుకైపాయే.
గుండెలనిండా ఉన్న
ప్రేమాభిమానాలన్ని
ఆవిరై..చీకటి నిండిన జీవితమై
అరుపులు ..కేకలు మిన్నంటగా
కాలం తీరిన మనిషివై...
రాలిపోయిన ఆకువై...
ఎండిపోయిన నీటి చెమ్మవై...
రెక్కలు విరిగిపోయిన పక్షివై..
కన్నవారుకుడా కడసారి చూడలేక
ఒంటరివై పోతున్నావ్.
చివరకు..మట్టే నీ స్నేహితుడాయే
చితిమంటలే నీ బంధువులాయే.

–అశోక్ గోనె
9441317361

నిశ్శబ్ద నిర్జీవ వర్తమానం

స్వచ్ఛమైన గాలి ఉంది
కాని మూతికి ముసుగు తప్పనిసరి
బాటలు ఖాళి
కాని బాణాల్లా దూసుకెళ్ళే బండ్లులేవు
చేతులు శుభ్రంగాఉన్నా
కరచాలనాలకు కట్టడి
సమయం దొరికింది
కాని దోస్తుల కలయికకు గస్తీ
వంటిల్లే ప్రయోగశాల
కాని ఫలితాల ఆస్వాదనకు అధిధులేరి?
ప్రతిపనిదినం బయటికెళ్ళాలనే ఆశ
కాని నిత్యం సెలవుతోనేసరి
సంపదెంత ఉన్న
వెచ్చించే మార్గం శూన్యం
నిరుపేద ఆర్జనకు నేడు
నిలువెత్తు ఆటంకం
ఈ దొరికిన ఖాళి సమయంలో
క్రియాశీలక, సృజన,కలల సాకారం కల్లతో
మనచుట్టూ పొంచి ఉన్న
కనిపించని శత్రువు కబళించకుండా
నిబద్ధతతో నిషిద్ధాలను పాటిస్తూ
ఈ నిశ్శబ్ద నిర్జీవ వర్తమానాన్ని
నిశ్శేషంగా పారద్రోలి
మునుపటి ఆనందమయజీవితాన్ని
నిరాటంకంగా ఆస్వాదించాలి.

–సంధ్య సుత్రావె
9177615967

ఈజవాబుకు మీ ప్రశ్న?

నేరం చేసినవాడిముఖం నిండా
తప్పుడుమేఘాలు
చర్మంతో మమేకమై చీకటిని
వెదజల్లుతూనే ఉంటాయి...
మనసులోని వికృతమంతా
ముఖంలోకి చిమ్ముతున్నప్పుడు
దానిని కమ్ముతూ అమాయకత్వం
నాట్యమాడుతూనే ఉంటుంది.
ఆటవిడుపుగా చేసిన నేరం
అడివిని కాల్చేసే
కార్చిచ్చు అవుతుందని
తెలియని బొమ్మలాటలో...
చూపుడువేళ్ళ
వలయం మధ్య దోషులుగా
నిలబెట్టినప్పుడు నిస్తేజమైన
అభిమాన్యులు వాళ్లిప్పుడు...
నిరసించి, నిందించి, నాశనం కోరడం
ధర్మమే....
కాని మనం చేయాల్సింది ఒక్కటే...
మానవత్వపు మధురిమ రుచిచూపించడం..
మమతల పాఠాలను నేర్పడం...
కారణ్యపు అమృతంతో
న్యూరాన్లను ప్రక్షాళన కావించి
మాతృత్వపు ప్రేమజైలుశిక్ష విధించడం...
కాలంతో పాటు కల్మషాలు కడిగేసుకుని,
మాలిన్యాలను భూస్థాపితంచేసి
కన్నీటిమేఘాలై
కురిసి కురిసి ఆవిరయ్యాకా
బయల్పడే ముఖాలకోసం...
నిరీక్షించడం మంచిదేమో...
ఆలోచిద్దాం,
ఆలోచన చేద్దాం...!!!

–కొత్తపల్లి ఉదయబాబు
9441860161,
9533756075

వర్తమాన తరుణం

కలిమి లేమి బేధం లేక
చెమ్మగిల్లిన నయనా లెన్నో...
చెదురుమదురుగా చెదిరిన
నీలి స్వప్నాలు ఎన్నో...
ఊపిరి పోసిన అమ్మను
చూడలేని వైనాలెన్నో...
బూజు పడుతున్న
వర్తమాన కాలపు దేహం..
ఆకాశాన్ని తాకిన
మౌన వేదనలు ఎన్నో..
కదిలే క్షణాలను ఆత్మీయంగా
కౌగిలించుకో లేని తరుణం..
ఒక్కసారి ఈ కాలాన్ని
అడగాలని ఉంది...
ఇన్నాళ్ళు ఈ మహమ్మారితో
చావు బతుకుల పోరాటం అని....
జీవన గమనాన్ని కాలపు
చక్రాల కింద చిదిమేస్తుందని..
ఆకలి కేకలను ఆనందిస్తూ..
బంధుత్వాలను బలితీస్తూ..
బతుకులను భారం చేస్తూ..
కడసారి వీడ్కోలు..
కన్నీటి సంద్రంఅయినా..
చివరి చూపు ..
శత్రువుగా మారిన వేళ..
కాసుల కరిగిపోతున్న
ఆస్తులు అరిగిపోతున్న..
ప్రాణ వాయువును ఒడిసిపట్టలేక
ఆయువు.. హారతిగా మారుతుంటే...
వైద్యయోధుల అలుపు ఎరుగని..
పోరాటం... మానవత్వం
చేయి చేయి కలపగా...
అందరి సమాజిక దృక్పథంతో...
అంతం కాక తప్పదు..
ఈ కఠినమైన కరోనా..

–వై.రమ్య
9951307281

తెలుసుకో... సోదరా !

కోయిల తన జీవితకాలంలో
పాడే రాగాలెన్నో.....
చెప్పుకుంటుందా ఏనాడైనా ?

నెమలి తన జీవనయానంలో
ఆడే నాట్యాలెన్నో...
డప్పుకొట్టుకుంటుందా ఏ రోజైనా ?

విహంగం తన బ్రతుకుగమనంలో
ప్రయాణించిన మైళ్ళు ఎన్నో....
లెక్కకట్టి చెపుతుందా ఏ దినమైనా ?

సాలీడు తన జీవన గూడులో
అల్లిన దారాలెన్నో...,,,
గొప్పలు చెపుతుందా ఏ ఘడియైనా ?

మరి వాటికిలేని ఆరాటం నీకెందుకో...
కవనాలు ఎన్ని రాసామోకాదు...
జనాలు స్పందించేలా రాయాలి
సన్మానాలు ఎన్ని వచ్చాయో కాదు
సంస్కరణలు జరిగేలా చూడాలి
పదవులు చేపడితే కాదు
పదాలు చైతన్యం కలిగించాలి
సుకవి గా చరిత్రలో నిలిచేది
రాశితోకాదు..వాసితో.....

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

అర్తిగీతం

చరిత్రకు
ఆధారమైన
వందేళ్ల నాటి
వస్తువులు అవి.

ఒకనాడు
ఐదేళ్లు నోట్లోకి
పోవాలంటే అవే? ఆదెరువు....
అరకను
గడ్డిపరకను
ఇంటిల్లిపాదిని
తండ్రిలా భుజనేసుకొని
లాలించిన బతుకుబండి అది..

కీరిటం లేని
మహారాజు
కీర్తి రథం అది...

సవారి తడకలేసి
సంసార జీవితాన్ని
జీవితయాత్రను
జాతరగా జేసిన
బతుకు బండి అది.

నేడు ప్రపంచీకరణ
సృష్టించిన పెనుప్రమాదంలో
ఆదెరువు గోల్పోయి
మూగజీవుల తోడు విడిచి
మ్యూజియంలో బందీ అయి
అనాథలా దర్శనమిస్తున్న
బతుకు బండి మన ఎడ్లబండి...

మూగనేలకు
భాషను....
మాగాణి మట్టికి
మానవత్వాన్ని నేర్పుటకై
అవనిపై
ఆకుపచ్చ సంతకం జేసే అరక.

నేడు
ఆదెరువు కరువై
అందరున్నా అనాథలా
అంగడిలో
అలంకరణ వస్తువైంది...
అన్నపూర్ణ దేవి చేతికలం హలం.

మట్టిని నమ్మిన రైతుచేతి
ఒకనాటి పనిముట్లు
నేడు అలంకరణ వస్తువులై
ఆర్తగీతం ఆలకిస్తున్న పనిముట్లు...

–ఉప్పరి తిరుమలేష్
9618961384

వర్తమాన తరుణం

కలిమి లేమి బేధం లేక
చెమ్మగిల్లిన నయనా లెన్నో...
చెదురుమదురుగా చెదిరిన
నీలి స్వప్నాలు ఎన్నో...
ఊపిరి పోసిన అమ్మను
చూడలేని వైనాలెన్నో...
బూజు పడుతున్న
వర్తమాన కాలపు దేహం..
ఆకాశాన్ని తాకిన
మౌన వేదనలు ఎన్నో..
కదిలే క్షణాలను ఆత్మీయంగా
కౌగిలించుకో లేని తరుణం..
ఒక్కసారి ఈ కాలాన్ని
అడగాలని ఉంది...
ఇన్నాళ్ళు ఈ మహమ్మారితో
చావు బతుకుల పోరాటం అని....
జీవన గమనాన్ని కాలపు
చక్రాల కింద చిదిమేస్తుందని..
ఆకలి కేకలను ఆనందిస్తూ..
బంధుత్వాలను బలితీస్తూ..
బతుకులను భారం చేస్తూ..
కడసారి వీడ్కోలు..
కన్నీటి సంద్రంఅయినా..
చివరి చూపు ..
శత్రువుగా మారిన వేళ..
కాసుల కరిగిపోతున్న
ఆస్తులు అరిగిపోతున్న..
ప్రాణ వాయువును ఒడిసిపట్టలేక
ఆయువు.. హారతిగా మారుతుంటే...
వైద్యయోధుల అలుపు ఎరుగని..
పోరాటం... మానవత్వం
చేయి చేయి కలపగా...
అందరి సమాజిక దృక్పథంతో...
అంతం కాక తప్పదు..
ఈ కఠినమైన కరోనా..

–వై.రమ్య
9951307281

జీవన పయనం..

నేనోసారి వెనక్కి తిరిగి చూడగా
జీవనపయనంలో నాతో పయనిస్తున్న
మరోవ్యక్తి అదృశ్యమయ్యాడు
ఇలా మొదటిసారి జరగలేదు
కానీ ప్రస్తుతం రోజొకరు నీతో
బేజారయ్యి శ్వాసగాజుకుండీని
పగులగొట్టి మరి వెళ్లిపోతున్నారు..

నిన్నటిదాకా వెంట తిరిగినతను
నా కంటపడకుండా మృత్యుఘంట
మోగించి కాలం మంటల్లో కాలిపోతే
నవ్వుతూ నవ్విస్తూ తన వ్యక్తిత్వంతో
నా హృదయానికి చేరువైనవాడు
అందరిని దుఃఖచెరువులో ముంచెత్తాడు..

కాలప్రవాహంతో పాటు
కనుమరుగౌతున్న జీవితాలెన్నో
ఇన్ని రోజులు కాలం జీవన ఆలవాలమై
ఊపిరిచ్చి జీవం పోస్తే
అదే కాలం మృత్యు దావానలమై
పగబట్టి మరి ఊపిరితీస్తుంది..

తన శ్వాసను పెంచుకోడానికి
అది తుంచుతున్న శ్వాసలెన్నో
తన అస్తిత్వానికై కిస్తులు కడుతూ
తెగ్గొడుతున్న పుస్తెలెన్నో
ఆరోగ్యం శిక్షయ్యి మరణశిక్షను
కడుతున్నవారు జాస్తియే..

ఎవరి పాపమో..!
నేడు భూలోకం అంతులేని
శోకంలో మునిగిపోయింది
తరువు యొక్క కొన్ని కొమ్మల్ని నరికేసిన
కాలం కేవలం బెరడుతోనే మిగితా
జీవితాన్ని నెట్టుకురమ్మని ఆజ్ఞాపిస్తోంది..

బెరడు కూడా కరడుగట్టిన
ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేసుకుని,
జీవనమర్మాన్ని, కర్మసిద్ధాంతాన్ని
అర్థం చేసుకుని పోరాట పటిమతో
ఆశల చిగురును పూయించి
పళ్ళు, ఫలాలతో జీవితాన్ని
ఫలవంతం చేయాల్సిందే..

–సర్ధరాజ్ అన్వర్
9440981198

కరోనా కాలం

ఉన్నట్టుండి
ఉలిక్కిపడ్డారు జనులు.
ఫస్ట్ వేవ్
పారేశాన్చేసే
సెకండ్ వేవ్
చమత్కారాలు చేసె.
మురిపంగా ఇకనైనా
ఉండనివ్వకుండా
మూడో వేవ్
ముందున్నదట.బ్లాక్ ఫంగస్
బెదురు పెడుతున్న వేళ
బజార్లలో సంచారానికి
బేజారెత్తు తున్నారు జనం
లాక్ డౌన్
డౌన్ లాక్ అవుతున్న వేళ
లక్షలాది ప్రజలు
లెప్టు రైట్ కొడుతున్నారు.

–సుతారపు వెంకట నారాయణ
9848958690

పుస్తక సమీక్ష

కదిలించే "కందిలి" కవితలు

కవి ఈ కవితా సంపుటిని తన బాపుకు అమ్మకు అంకితం ఇచ్చారు. గోపగాని రవీందర్ ముందుమాట రాసారు. 101 కవితలున్నాయి ఈ కవితా సంపుటిలో. జీవితానుభవంలోంచి, సాంద్రమైన మంచి చెడుల్ని అక్షరీకరింపజేయడం ఈ కవి కవిత్వంలో కనిపిస్తుంది. మనసున్న ప్రతివార్ని కదిలించే కవితలెన్నో ఈ పుస్తకంలో ఉన్నాయి. శక్తివంతమైన భావావిష్కరణ చాలా కవితల్లో చూడగలం.

"సగం సగం ఆనందాల-మునక లేయడం నాకు రాదు-
సుఖమో, దుఃఖమో- నిండా మునగాల్సిందే
గుండెనిండా జ్ఞాపకాల తడిలోపడి
బ్రతకాల్సిందే" అంటారు. "వెన్నెల మరకలు" కవితలో

చాలా కవితలో తన మార్గాన్ని కవి స్పష్టంగా చెపుతారు. "ఆశ మిగిల్చిన ఆనందం" కవిత (పేజి.32)లో చివరి వాక్యాలు మనల్ని వెంటాడుతాయి.

"కన్నీళ్ళతో తడిచిన దుప్పట్లు ఆరేయడం
నిత్యకృత్యమే నాకు
అందుకు మాయల మర్మమేదీ నాకు తెలియదు
ఊహల ఉప్పెనలో కొట్టుకుపోవడం తప్ప..



మనుష్యులు కవితలో చివరి వాక్యాలు ఆలోచింపజేసేలా రాసారు. కాని ఇంకా ఆశావహ ధృక్పథంతో ముగించిన బాగుండేది. (పే.123)

"సనాతనులున్నంత కాలం
మార్పు మరుగున పడే ఉంటుంది
తీర్పూ వారి వైపే- మొగ్గుతుంది" అంటారు.

అగ్గిపుల్ల- గౌండ్లోళ్లతాత- బల్లచెక్క- లాక్‌డౌన్- మరణం- మౌనం నువ్వైతే- హారతి పళ్లెం- బడి-దైన్యం- అంతిమయాత్ర- మౌనం- చేతులు గాలిదేవుడు- మృత్యువులాంటి కవితల్లో మట్టి పరిమళాల సుగంధం వెదజల్లుతాయి.. భావస్పష్టత కనిపించే కవితలు పాఠకుల్ని అలరిస్తాయి.

ప్రతులకు: పాలపిట్ట బుక్స్
16-11-20/6/1/, 403
విజయసాయి రెసిడెన్సీ
సలీంనగర్, మలక్‌పేట
హైదరాబాద్-36.

– తంగిరాల చక్రవర్తి
సెల్: 9393804472

స్నేహితుడంతే !

ఓటమి రక్కసి
నిన్ను తరుముతున్నప్పుడు
అతను
ఆత్మవిశ్వాసపు ఆయుధాన్నందించే
పుస్తకమవుతాడు.

కష్టాలకడలిలో
నువ్వు కొట్టుకుపోతున్నప్పుడు
అతను ఆదరించె పడవై
నిన్ను ఆవలితీరం చేర్చుతాడు.

సమస్యల చీకట్లు
నిన్ను నిలువునా చుట్టుముట్టినప్పుడు
అతను పరిష్కారపు వెలుగై
నీకో కొత్తదారి వేస్తాడు.

కలతల తుఫాన్లు
నిన్ను తడుపుతున్నప్పుడు
అతను ధైర్యపు ఛత్రమై
నీ తలపైన నిలుస్తాడు.

నీ పచ్చని ఆశలు
పండుటాకుల్లా రాలుతున్నప్పుడు
అతను వసంత ఋతువై
నీకెదురొస్తాడు.

చేదు స్వప్నాలు
నిన్ను నీడలా వెంటాడుతున్నప్పుడు
అతను లేలేత సూర్యకిరణమై
నిన్ను మేల్కొలుపుతాడు.

బాధల ఉక్కపోతలో
నువ్వు ఉక్కిరిబిక్కిరైనప్పుడు
అతను సీతాకోక చిలుకై
నీకు గాలి విసురుతాడు.

నిరుత్సాహపు నీడలు
నిన్నావరించినప్పుడు
అతను ఉత్సాహపు వెలుతురై
నీకు దారిచూపుతాడు.

గెలుపు శిఖరంపై
నువ్వు కూర్చున్నప్పుడు
అతను చిరునవ్వుల పువ్వై
నీ పెదాలపై పూస్తాడు

–ఎన్.నరేశ్ చారి
9701334516

నిర్మల్ జిల్లా కవుల రచనలలో సామాజిక కోణం

చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన నిర్మల్ జిల్లాకు ఎంతో ప్రశస్తి ఉంది. నిమ్మనాయుడు పాలించిన కారణ ంగా " నిర్మల్ " అనే పేరు వచ్చింది. పచ్చని ప్రకృతితో అలరారే ఈ జిల్లాలో ఎందరో కవులు, కళాకారులు ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణ తల్లి రూపశిల్పి శ్రీ బైరోజు వేంకట రమణాచారి గారు నిర్మల్ వాస్తవ్యులే. జిల్లా అడవులలో దొరికే పొనికి కర్రతో చెక్కిన అద్భుతమైన నిర్మల్ కొయ్యబొమ్మలు, ఇక్కడి కళాకారులు చిత్రించిన నిర్మల్ చిత్రాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. ఈ జిల్లాలో ఎందరో కవులు కూడా సాహిత్య సేవలో ఉన్నారు.

నేటి సమాజం అనేకమైన సమస్యల తో సతమతమవుతూ ఉంది. ముఖ్యంగా కులం, మతం, శ్రమదోపిడి మొదల గునవి. వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు తగ్గి, స్వార్థం పెరిగిపోయి అన్ని రుగ్మతలకు కారణం అయ్యాయి. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట అత్యాచారాలు, యాసిడ్‌దాడులు జరుగుతున్నాయి. ప్రాంతీయ బేధాలతో ఆచార వ్యవహారాలు, భాషయాసలపై హేళన చేయడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితులలో సమాజంలో మార్పు కొరకు సామాజిక

ఉద్యమకారులు మరియు సాహిత్య కారులు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా కవులు తమ రచనల ద్వారా సమాజంలోని సమస్యలపై పోరాటం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని నేటితరం కవులు తమ రచనలలో సామాజిక అంశాలనే ఇతివృత్తంగా స్వీకరించి రచనలు చేస్తూ సమాజంలో మార్పు కొరకు కృషి చేస్తున్నారు. ఆ కవులను గుర్తించి, వారి రచనలు సేకరించి, అం దులోని సామాజిక అంశాలు గుర్తించి, అవి సమాజానికి ఏవిధంగా దోహదపడుతున్నాయో తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి. డా॥ దామెర రాములు గారి రచనలపైన ప్రస్తుతం రెండు సిద్ధాంత పరిశోధనలు (గ్రష్ణ.ణ) జరుగుచున్నవి.

డా॥ దామెర రాములు : వైద్య చికిత్సనే కాదు సామాజిక చికిత్స తెలిసిన వ్యక్తిగా తన కవిత్వం ద్వారా ప్రజలను జాగృత పరుస్తూ ఉన్నారు. వృత్తి రీత్యా వైద్యుడు అయినా సాహిత్యంపై అపారమైన ప్రేమ కలిగి సుమారుగా 13కు పైగా పుస్తకాలు రాయడం జరిగింది. వీరిపై ప్రస్తుతం రెండు సిద్ధాంత పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. యుక్త వయస్సులోనే విప్లవ భావజాలానికి ఆకర్షితుడై దేశంలో అత్యవసర కాలంనాటి పరిస్థితులపై తన " కోరస్ " ను వినిపించాడు. ఇది తరువాతి కాలంలో కూడా అప్రకటిత అత్యయిక స్థితిలాంటి నిర్బంధ వాతావరణంపై " కోరస్ "గా కొనసాగింది. తరువాత " నెత్తుటి వెన్నెల " ద్వారా కష్టజీవుల బాధామయ జీవితాలను చిత్రీకరించడం జరిగింది. " జయహే తెలంగాణ " ద్వారా దోచుకొనే ఆంధ్రావాళ్ళను మా ప్రాంతాలను వదిలిపెట్టి మీమీ ప్రాంతాలకు వెళ్ళిపొండ్రి లేదా మేమే వెళ్ళగొడతాం అని ఉద్యమ స్వరాన్ని వినిపిస్తాడు. " కొర్రాయి " ద్వారా తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులు, కులం అనే విషపు బీజం గురించి, ఉద్యమంలో యువకుల బలిదానాలు మొ॥ విషయాలపై చర్చిస్తాడు. అసలు ముఖం అనే పుస్తకం ద్వారా ప్రతి మనిషికి రెండు ముఖాలుంటాయని, ఎవరికైనా అసలు ముఖమే సౌకర్యంగా ఉంటుందని అంటాడు. వైద్యవృత్తిలో తీరిక లేకుంట ఉన్నప్పటికి తన సాహితీ వ్యాసంగం ద్వారా ప్రజలను జాగృతపరుస్తూ సమాజాన్ని ఉద్ధరిస్తూ ముందుకు సాగుతూ ఉన్నారు.

డా॥ అప్పాల చక్రధారి : నిర్మల్‌లో ప్రముఖ పిల్లల వైద్యునిగా పేరందుకున్న డా॥ అప్పాల చక్రధారి గారు అవును నేను " ఆదిలాబాదోన్నే " అను పుస్తకం ద్వారా మన భాష, యాసలపై హేళన చేస్తున్న వారిపై ఎదురుదాడి చేసారు. ఆదివాసీల ప్రాంత జీవన సంస్కృతినీ, నిష్కల్మషమైన హృదయాలు ఉండే మానవీయ విలువల మనుషులతో నిర్మలంగా సాగే యాసపై హేళన చేస్తూ ఉంటే " అవును నేను ఆదిలాబాదోన్నే " అంటూ ధీటైన సమాధానం ఇచ్చారు. వారి రెండవ పుస్తకం " జలగ " ద్వారా రాజకీయ చదరంగం వికృత రూపాన్ని, ప్రజల్ని ఎలా తప్పుదోవ పట్టిస్తున్నాయో, ఎలా విషవలయంలోకి తోస్తున్నాయో కూలంకషంగా చర్చించారు. ధనం, మద్యం, బూటకపు వాగ్ధానాలు ఎలా రాజకీయ జలగలు గుప్పిస్తున్నాయో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాల్గోస్తంభమైన మీడియా ప్రజల పక్షం నుండి తప్పుకుని పాలక పక్షానికి, వలస ఆధిపత్య భావజాల పక్షాన నిలిచి తన అసలు ఉనికి కోల్పోయాయి. చివరిగా భావితరాలకు మంచి రాజకీయ వారసత్వం ఇవ్వండని కోరుకుంటాడు.

మునిమడుగుల రాజారావు: వీరు గత 20 సం॥ల నుండి సాహితీ వ్యాసంగంలో ఉన్నారు. ముఖ్యంగా మొదట్లో వచన కవితల ద్వారా తరువాత కాలంలో వ్యాసాల ద్వారా తమ రచనలను కొనసాగిస్తున్నారు. వృత్తిరీత్యా జీవిత భీమా కంపెనీలో పనిచేస్తున్నప్పటికి సమాజాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని రచనల ద్వారా సమాజంను జాగృత పరుచుటకు కృషి చేస్తున్నారు. వీరు సమాజంలోని కులసమస్య, శ్రామిక దోపిడి, అస్తిత్వ ఆధిపత్యం కాపాడుకొనే ప్రక్రియలో అమానవీయ అణిచివేత ప్రక్రియలను రూపుమాపే దిశలో రచనలు చేస్తున్నారు. మొదట్లో " దు:ఖనది " కవితా సంపుటి ద్వారా సమాజంలోని అనేక సమస్యలపై స్పందించడం జరిగింది. అటు తరువాత సత్యమంటే ఏమిటి, సత్యం వైపు పయనం అను రచనల ద్వారా ప్రజలను ప్రేమ వైపుకు మళ్ళించడం ద్వారా వారిలోని మానవత్వాన్ని తట్టి లేపే విధంగా రచనలు చేస్తూ ఉన్నారు.

తుమ్మల దేవరావు: వృత్తిరీత్యా ఉపాధ్యాయులు అయిన వీరు గత 23 సం॥లుగా సాహితీ వ్యాసంగంలో కొనసాగుతూ అనేకమైన కవితలు, కథలు, చరిత్ర కథలు, బుర్ర కథలు, పాటలు, హైకులు రాయడం జరిగింది.

" కచ్చురం " కవితా సంపుటి ద్వారా గ్రామీణ నేపథ్యాన్ని, పల్లె ప్రజల జీవన విధానాన్ని చక్కగా చిత్రీకరించడం జరిగింది. భూదేవి, చెరువుకట్టు, ఇడుపుకాగితం, వాన నేను ఆకాశం మొ॥లగు కథల ద్వారా గ్రామీణ ప్రాంతంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారి కుట్రలను, కుతంత్రాలను చక్కగా వివరించడం జరిగింది. ఇంకా సారానిషేధంపై పాటలు, బుర్రకథల ద్వారా సారవల్ల కలిగే కష్టనష్టాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. పిల్లల కోసం అనేక పాటలు, నాటికలు రాసి వారిలో చైతన్యం కోసం కృషిచేస్తున్నారు. వీరు అనేకమైన చరిత్ర కథలను రాసి నిర్మల్ చరిత్రను వెలికి తీయడం జరిగింది.

అంబటి నారాయణ: వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తిగా సాహితీ వ్యాసాంగం కొనసాగిస్తున్నారు. గత 25 సం॥లుగా తన రచనల ద్వారా సమాజంను జాగృతం చేస్తూ అనేక సాహితీ అవార్డులు పొందడం జరిగింది. వీరు రాసిన "తడి" కవితా సంకలనంలో "కూత" అనే కవిత నందు అంతరించిపోతున్న ప్రేమతత్వాన్ని, వలస బతుకులు, శ్రమజీవి చమట తడిని గురించి ఎంతో ఆర్ద్రంగా వివరించారు. "మోత" అనే పుస్తకంలో అనేక సంఘటనలపై ప్రతిస్పందించారు. " యువనేస్తం " పుస్తకం ద్వారా యువత మేల్కొంటేనే సమాజం బాగుంటుందని అంటారు. విద్యావికాసం అను పుస్తకంలో మనిషి విద్యను అభ్యసించడం ఎంత అవసరమో అలాగే ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకోవడం అంతే అవసరమని సూచన చేస్తాడు. ఈ కవి తన స్వగతం గురించి, అట్టడుగు జనాల గురించి, వాస్తవ సజీవ సత్యాల గురించి తన కవిత్వంలో రాయడం జరిగింది.

కదారి దశరథ్ : కదారి దశరథ్ గారు వృత్తిరీత్యా తెలుగు పండితులు. ప్రవృత్తిగా సాహిత్యవ్యాసంగాన్ని ఎంచుకొని, సాహితీ సేవ చేస్తున్నారు. వీరు రాసిన "కదారిశతకం ", కైతిక క్షేత్రం రెండూకూడా

హాస్య శతకం

-హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

ఆటవెలదులందు, తేట మాటలలోన
వ్రాసి, సరసులైన పాఠకులకు
అందజేయుచుంటి 'హాస్య శతక' మేను,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసముపైన అమితాభిమానము
నాకు గలదు చిన్ననాటి నుండి;
కాన, వ్రాయుచుంటి దానిపై శతకమ్ము,
రసములందు హాస్యరసము మిన్న!

నవ్వగలుగు ప్రాణి నరు డొక్కడే, అన్య
జీవు లెవియు నవ్వలేవు గాన,
హాస్యరసము నరుల కాస్పాద్యమై యుండె,
రసములందు హాస్యరసము మిన్న!

నవ రసమ్ములందు నవ్వించు గుణము హా
స్యమ్మునందె కలదు, అందువల్ల
అందరికిని హాస్య మాస్వాద్య యోగ్యమౌ,
రసములందు హాస్యరసము మిన్న!

లోకమందు నుండు రుచి భేదములు, హాస్య
మునకు హెచ్చు సంఖ్య మొగ్గు జూపు
చుండు ననిన అతిశయోక్తి కాబో దది,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మున్న చోట ఆనంద మారోగ్య
మును రహించు, నాయు వనుగమించు;
అందువలన హాస్య మావశ్యక మ్మౌను,
రసములందు హాస్యరసము మిన్న!

చిలకమర్తివారు సృష్టిచేసిన హాస్య
'గణపతి'ని దలంచి కలుముబట్టి,
హాస్య శతక రచనకై పూనుకొంటిని,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమును సృజించి, అలరించి పఠితల
చిర యశస్సు గొన్న చిలకమర్తి
సత్కవీంద్రు దలతు శతక సంపూర్తికై,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య రచనలందు అందెవేసిన చెయ్యి
భమిడిపాటి వారు, వారి నిచట
గుర్తు చేసుకొనుట కర్తవ్య మనుకొందు,
రసములందు హాస్యరసము మిన్న!

ఇంతలోననే 'గిరీశము' పంతులు
గారు గురుతు వచ్చినారు, వారి
పేరు హాస్యమునకు మారుపే రౌగదా!
రసములందు హాస్యరసము మిన్న!

వరుస, మొక్కపాటి వారి 'బారిస్టరు
పార్వతీశము'నకు వందనమ్ము
సలుపకున్న హాస్య శతకమ్ము సాగునా?
రసములందు హాస్యరసము మిన్న!

ముళ్లపూడి వారి 'బుడుగు' హాస్య రసమ్ము
జాలువార్చినట్టి బాలకుండు;
అతని పేరు తలచు టావశ్యకము కదా!
రసములందు హాస్యరసము మిన్న!

అడ్డమైనవారి 'నప్పు లప్పారావు'
'ఫైవు ఫై' వటంచు భయముగొల్పు;
హాస్య సంఘమందు నతడును సభ్యుడే!
రసములందు హాస్యరసము మిన్న!

కాళ్లకూరి వారి గడుసు చిత్రణ 'సింగ
రాజు లింగరాజు' ప్రముఖ లోభి
పాత్ర, నాటకమున పండించె హాస్యము!
రసములందు హాస్యరసము మిన్న!

అత్తగారి కథల నాంధ్రుల కందించె
హాస్యరసపు గుళిక లట్లు వ్రాసి;
భావుమతి కలమ్ము బహుధా ప్రశస్తము!
రసములందు హాస్యరసము మిన్న!

చిన్న పెద్ద అనక , అన్ని వయస్సుల
యందు నున్నవార లాదరించి,
మెచ్చు రసము హాస్యమేకదా లోకాన!
రసములందు హాస్యరసము మిన్న!

భక్తి కథలు చెప్పు 'భాగవతారులు'
నడుమ 'పిట్ట కతలు' నుడువ వినమె?
రక్తి పెంచు హాస్యరస ముండు వానిలో!
రసములందు హాస్యరసము మిన్న!

అగ్రనటుల మించి అలరించె ప్రజల 'రే
లంగి' చలనచిత్ర రంగమందు;
హాస్య నటనమందు అత డద్వితీయుండు!
రసములందు హాస్యరసము మిన్న!

'రాజబాబు' హాస్య రారాజుగా నేలె
చలనచిత్ర సీమ చాల యేండ్లు;
అతని నటన మెచ్చనట్టివా రుండిరా?
రసములందు హాస్యరసము మిన్న!

పాత తరమునందు 'పద్మనాభము' కీర్తి
పొందె హాస్య నటనమందు నెంతొ;
హాస్యపాత్ర ప్రజల నాకట్టుకొను నిట్టె!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమునకు రూపమౌను 'బ్రహ్మానంద',
మతడు వెయ్యి పాత్ర లధిగమించె;
కీర్తి కొల్లగొనెను 'గిన్నిస్ రికా' ర్డెక్కి!
రసములందు హాస్యరసము మిన్న!

అగ్ర నటుల కన్న హాస్య నటులె హెచ్చు
గలరు చలనచిత్రములను నేడు;
హాస్య ముండెనేని ఆడును చిత్రాలు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మద్దుచుండు రందందు ముఖ్య పా
త్రలకు గూడ దర్శకులు శ్రమించి;
ప్రాణవాయు వగును హాస్యమ్ము కథలకు!
రసములందు హాస్యరసము మిన్న!

అన్య రసము లెవియు ఆకట్టుకొనలేవు
హాస్యమట్లు ప్రేక్షకాళి, గాన
హాస్యపాత్ర కథల ననివార్య మైపోయె!
రసములందు హాస్యరసము మిన్న!

వేయుచుండె పెద్ద పీట హాస్యానికి
చలనచిత్ర సీమ తొలుత నుండి,
హాస్య ముండదేని ఆడవు సినిమాలు!
రసములందు హాస్యరసము మిన్న!

ఒకడు కరుణ మనియె, నొకడు శృంగారమ్ము
చెప్పె, నేను రెంటి నొప్పుకొనను;
నవ రసాలలోన నాకు హాస్యమె నచ్చు!
రసములందు హాస్యరసము మిన్న!

చిన్నబుచ్చ నేను శృంగార కరుణ వీ
రాదు లల్ప రసము లనుచు; హాస్య
రస విశిష్టత నిట వ్రాయ బూనితి, నంతె!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మనగ వెకిలి వ్యవహారములు కాదు,
నవ్వులాట కాదు, నవ రసమ్ము
లందు గణన కెక్కినట్టి మేల్ రస మది!
రసములందు హాస్యరసము మిన్న!

చెప్పవలయు మొదట శృంగారమును, ద్వితీ
యమున నెంచదగును హాస్యరసము;
ఇతర రసము లెవియు ఈ రెంటి కెనరావు!
రసములందు హాస్యరసము మిన్న!

జడుని హాస్యరసము స్పందింప జేయును,
మూర్ఖుడైన హాస్యమునకు లోగు;
హాస్యమునకు నుండె నట్టి అద్భుత శక్తి!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము నచ్చనట్టి మానవునకు
నితర రసము లింక నెటు రుచించు?
రసవిహీనమైన బతుకు లుండును కొన్ని!
రసములందు హాస్యరసము మిన్న!

వివిధ రసము లుండె, భిన్న రీతుల ప్రభా
వమ్ము జూపు నరులపైన నవ్వి;
హాస్యరసము నరుల నలరించు, నవ్వించు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమునకు నుండె నత్యాదరము ప్రేక్ష
కాళియందు, గాన హాస్య నటుల
సంఖ్య పెరుగుచుండె సతతమ్ము, గానరో!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము నచ్చనట్టివా డొక్కడు
కానరాడు భూమిపైన; నట్టి
వింత మనిషి యున్న వేవేల దండాలు!
రసములందు హాస్యరసము మిన్న!

కలవు హాస్య పత్రికలు కొన్ని తెలుగులో,
వేయు హాస్యమునకు పెద్ద పీట;
హాస్యమే ప్రధాన మా పత్రికలలోన!
రసములందు హాస్యరసము మిన్న!

వ్యంగ్య చిత్రములును, వ్యంగ్య సంభాషణల్
ప్రాణవాయు వగును పత్రికలకు;
వ్యంగ్య మనగ హాస్య భంగ్యంతరమె కదా!
రసములందు హాస్యరసము మిన్న!

కలరు వ్యంగ్య చిత్రకారులు పెక్కుండ్రు,
ప్రజల మన్ననలకు పాత్రు లగుచు;
కొంద రుండ చాల గుర్తింపు గన్నారు!
రసములందు హాస్యరసము మిన్న!

ప్రోత్సహించుచుండు పోటీలు పెట్టుచు
హాస్య కథల కొరకు అప్పుడపుడు;
పాఠకాభిరుచుల పత్రికల్ మన్నించు,
రసములందు హాస్యరసము మిన్న!

వ్యంగ్య చిత్రములకు పత్రికల్ పోటీలు
పెట్టి, ప్రోత్సహించు విధము గలదు;
పత్రికలకు పెట్టుబడి పాఠకుల మెప్పు,
రసములందు హాస్యరసము మిన్న!

విడిగ హాస్య సన్నివేశముల్ వ్రాయించి
కలిపెదరు ప్రధాన కథకు; చలన
చిత్రసీమ నిట్టి 'సిత్రాలు' పెక్కులు!
రసములందు హాస్యరసము మిన్న!

మూలమందు లేకపోయిన, హాస్య సం
భాషణముల మధ్యమధ్య జేర్చి
నటులె ప్రేక్షకులను నవ్వించుచుందురు!
రసములందు హాస్యరసము మిన్న!

కానవచ్చు గాదె గంభీర కథలందు
హాస్యరసము పులుము టచ్చటచట;
అట్లు పులుమకున్న అవి మెప్పు గనబోవు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మని భ్రమించి అశ్లీల పదముల
వాడుచుందు, రట్లు వాడ దగదు;
హాస్య ముండవలయు ఆరోగ్యవంతమై!
రసములందు హాస్యరసము మిన్న!

ఎన్నొ బూతు మాట లీనాడు చలనచి
త్రాలలో ధ్వనించు దారుణముగ;
బూతు విన్న రోత పుట్టు, హాస్యము కాదు!
రసములందు హాస్యరసము మిన్న!

రోత కలుగజేయు బూతు 'డైలాగులు',
కుళ్లు 'జోకు' వల్ల ఒళ్లు మండు;
హాస్య ముండవలయు నాస్వాద్య యోగ్యమై!
రసములందు హాస్యరసము మిన్న!

అందరికిని నచ్చు హాస్యావధానాలు,
నవ్వవలయు నచట నెవ్వరైన;
నవ్వకుండువాడు నరుడె కా దనవచ్చు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము నరున కౌషధమ్ముగ నుప
యోగపడుట గూడ నుండు నంట!
చాల రోగములకు సంజీవని నగవు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమునకు కొన్ని వ్యాధుల తగ్గించు
గుణము కలదు గాన, కొన్ని చోట్ల
నడుపబడుచు నుండె నవ్వుల సంఘాలు!
రసములందు హాస్యరసము మిన్న!

నవ్వుల సంఘాలు=లాఫింగ్ క్లబ్స్
హాస్యరసము రచనలందున గుప్పించి
గొప్ప పేరు తెచ్చుకొన్న కవులు
తెలుగు బాసలోన గల రెండరేనియు!
రసములందు హాస్యరసము మిన్న!

చిలకమర్తి వారి సృష్టియౌ 'గణపతి'
నవల చదువునపుడు నవ్వకుండ
నుండ గలుగువార లుందురా యెందైన?
రసములందు హాస్యరసము మిన్న!

ఆది కవులయందు, అత్యాధునిక కవు
లందు గానవచ్చు హాస్యరసము;
అంతొ యింతొ వ్రాసి రందరు హాస్యమ్ము,
రసములందు హాస్యరసము మిన్న!

ఆంధ్రభాషలోన హాస్యప్రధాన కా
వ్యములు పూర్వు లేల వ్రాయలేదొ?
కారణమ్ము లుండితీరు నట్లగుటకు!
రసములందు హాస్యరసము మిన్న!

అద్యతన కవులకె హాస్యరసమ్ముపై
ప్రీతి కలదు, పెక్కు వ్రాత లొదవె;
ఉత్సహించి వ్రాయ ప్రోత్సాహమును నుండె!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య రచన చదివి, ఆపైన వేరొక్క
రసప్రధానమైన రచన బట్టి
చదువ బూనుకొన్న మదికెక్కబో దది!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య రచన నచ్చ దనువారు సాధార
ణముగ కానబడరు, ప్రముఖులైన
వ్యక్తులును పఠింత్రు హాస్య పుస్తకముల,
రసములందు హాస్యరసము మిన్న!

లాక్షణికులు హాస్యరసమున కున్నత
స్థాన మొసగినారు శాస్త్రమందు;
హెచ్చు ప్రజలు నచ్చి మెచ్చు రస మ్మదే!
రసములందు హాస్యరసము మిన్న!

బాలలందు పెరుగు పఠవమం దాసక్తి
మొదట హాస్యకథలు చదివిరేని;
ఇట్టి వెల్ల పెద్ద లెరిగియుండుట లెస్స!
రసములందు హాస్యరసము మిన్న!

నవ్వులాట కాదు నవ్వు పుట్టించెడు
హాస్య రచన చేయుటన్న కవికి;
ప్రసవ వేద నుండు ప్రతియొక్క రచనకు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య రచన లెపుడు అతి జాగరూకత
గలిగి వ్రాయుచుండ వలయు గాని,
అదపు తప్పెనేని హాస్యాస్పద మ్మౌను!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య భాషణమ్ము లందరి నలరించు,
నైన హద్దు లెరుగు టవసరమ్ము;
హద్దు మీరు హాస్య మపహాస్యమైపోవు!
రసములందు హాస్యరసము మిన్న!

స్థాయి మరచి హాస్య సంభాషణము చేయ
దగదు, ముప్పు వచ్చు దానివల్ల;
సాటివారితోడ సాగించు టది లెస్స!
రసములందు హాస్యరసము మిన్న!

మోటు హాస్యమునకు ముగ్ధుడొ నొక్కడు,
మెచ్చు నీటు హాస్యమే యొకండు;
వ్యక్తి స్థాయిబట్టి స్పందనల్ మారును!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య పాత్ర లేనియట్టి రూపకములు
మృగ్య, ముండెనేని యెక్కడైన,
తగిన కారణములు తప్పక కనిపించు,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసమునందు అమృత లక్షణ మేదొ
కలసియుండు, నట్లుకాని యెడల
అందరికిని అద్ది ఆస్వాద్య మెట్లౌను?
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము గ్రోలి ఆనందపారవ
శ్యమ్ము పొందవచ్చు, నందువల్ల
అతిశయోక్తి కాదు హాస్య మమృత మన్న!
రసములందు హాస్యరసము మిన్న!

అమృత మమృత మందు, రది పుస్తకాలకే
పరిమితమ్ము, దాని నరు లెరుగరు;
హాస్యరసమె నరుల కమృత సదృశ మౌను!
రసములందు హాస్యరసము మిన్న!

కొందరికిని నచ్చి, కొందరు మెచ్చని
రసము లుండు; హాస్యరస మనంగ
ఆదరించి మెచ్చు నాబాల వృద్ధము!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసమునుండె ఆవిర్భవించును
నవ్వు, నవ్వగలదు నరు డొకండె;
నవ్వు వలన గలుగు నరుల కెంతో మేలు!
రసములందు హాస్యరసము మిన్న!

మొగముపైన గంటు,ముక్కుపై కోపము,
చిర్రు బుర్రు మనుట చిందులాట
హాస్యరస విహీనమౌ జీవికే చెల్లు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము గ్రోలి, ఆనందపడలేని
వ్యక్తి జీవితమున రక్తి హల్లి;
రక్తి లేని బతుకు రసహీన రచనమౌ!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము గూర్చి అవహేళనముగ మా
టాడువారు నుందు, రట్టివాని
గణన యేల? వ్యక్తిగత భావనలె అవ్వి!
రసములందు హాస్యరసము మిన్న!

పూర్వ కవుల గ్రంథములలోన హాస్యము
విరళ, మద్యతనులు వివిధ గతుల
హాస్యభరిత రచన లందించుచున్నారు,
రసములందు హాస్యరసము మిన్న!

'యక్షగాన' రచనలం దుండె హాస్యము
పుష్కలముగ; తోలుబొమ్మలాట
లందు జూడవచ్చు 'అశ్లీల' హాస్యమ్ము!
రసములందు హాస్యరసము మిన్న!

కవుల నడిగి హాస్య గ్రంథాలు వ్రాయించు
కొన్న 'దొరలు' గలరు కొంతమంది;
'పానుగంటివారు' వ్రాసి ర ట్లొక్కటి!
రసములందు హాస్యరసము మిన్న!

వచన మాధ్యమమున వచ్చె హాస్యప్రధా
నమ్ములైన పుస్తకమ్ము లెన్నొ;
చదువరులకు సులభసాధ్యమౌ వచనమ్ము,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య నాటికలకు అందందు పోటీలు
నిర్వహింపబడుట నేడు కలదు;
హాస్యరసము నరుల కాహ్లాద మొసగదా?
రసములందు హాస్యరసము మిన్న!

అన్య రసము లెవియు ఆకట్టుకొనలేవు
హాస్య మట్లు జనుల నా క్షణంబ;
కాన హాస్యరసము కడు హృద్య మగుచుండె!
రసములందు హాస్యరసము మిన్న!

బయటపడరు గాని, స్పందింతు రొక కొంత
మంది హాస్యమునకు మానసమున;
రాతిగుండె నైన రంజించు హాస్యము!
రసములందు హాస్యరసము మిన్న!

చదువుచుండి హాస్య సన్నివేశమ్ముల
పరిసరాలు మరచి, పరవశించి
పకపక మని నవ్వువా రుందు రందందు!
రసములందు హాస్యరసము మిన్న!

అనుభవించినట్టి హాస్య సంఘటనల
పరుల కెరుకపరచి, మరల మరల
సంతసించువారు సర్వత్ర నుందురు!
రసములందు హాస్యరసము మిన్న!

అదపు తప్పెనేని హాస్యము రవ్వంత,
సరస మెల్ల పోయి విరస మగును;
వ్యంగ్యమునకు నికట బంధువౌ హాస్యము!
రసములందు హాస్యరసము మిన్న!

ఒరులు సంతసించ నోర్వజాలని వారి
సంఖ్య లోకమందు చాల గలదు;
హాస్య మట్టివారి కస్పృశ్యమే యగున్
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మాధ్యమమున ఆరోగ్యదాయక
భావములను పొందుపరచి గ్రంథ
ములు రచించ,చదువరుల సంఖ్య హెచ్చౌను!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యపాత్ర లెన్నొ ఆధునికాంధ్ర సా
హిత్య రంగమున అహీన కీర్తి
నంది,నిలిచియుండె నజరామరమ్ములె!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య కథలతోడ ఆసక్తి రగిలించి,
నేర్పవచ్చు పిదప నీతి కథలు;
బాల పాఠకులకు వర్తించు తీరిది!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య మాడగూడ దంగవైకల్యము
వలన బాధజెందు వారి జూచి;
పరుల నొవ్వజేయు పలుకు హాస్యము కాదు!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యచతుర యైన అతివ యిల్లాలైన,
స్వర్గధామ మౌను వారి యిల్లు;
సంతసమ్ము తప్ప సంతాప ముండదు!
రసములందు హాస్యరసము మిన్న!

ఆలుమగలు హాస్యశీలురై యున్న, దాం
పత్య జీవితమ్ము మధుర మౌను;
ఆ గృహమ్ముకాదె ఆనంద నిలయమ్ము?
రసములందు హాస్యరసము మిన్న!

హాస్య నటులు మువ్వు రందుకొన్నారు భా
రత ప్రభుత్వ మొసగు ప్రథిత 'పద్మ'
బహుమతులను నేటి వరకు, రావలె నింక!
రసములందు హాస్యరసము మిన్న!

గౌరవాదరములు గతమునందున రాచ
కొలువులన్ విదూషకులకు దక్కె;
హాస్యమునకు దొరకె నానాడె గుర్తింపు!
రసములందు హాస్యరసము మిన్న!

పక్కన నొక హాస్యపాత్ర యుండిననె నా
యకుని పాత్ర మెప్పు లందగలదు;
చలనచిత్ర కథలు చాటు నీ సత్యమ్ము!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమునకు వ్యంగ్య మక్కయో చెల్లెలో
తెలుసుకొనుట అంత సులువు కాదు;
తెలిసి వాడకున్న ఫలితాలు వికటించు!
రసములందు హాస్యరసము మిన్న!

అయ్యగారి 'జోకు' హాస్యశూన్యం బైన,
కిందివారు నవ్వకుందు రెట్లు?
కాని యెడల అయ్యగా రాగ్రహించరా?
రసములందు హాస్యరసము మిన్న!

కన్న, విన్న, చదువుకొన్న హాస్యము మాన
వులకు ధృతిని తృప్తి కలుగ గలదు;
దాన పొందగలరు మానసోల్లాసము!
రసములందు హాస్యరసము మిన్న!

వ్యక్తి స్థితిని బట్టి హాస్య మాస్వాదించు
టుండె, హెచ్చు తగ్గు లుండు నందు;
బాలలందు హెచ్చు స్పందనల్ గనవచ్చు!
రసములందు హాస్యరసము మిన్న!

లోన నవ్వు పుట్టు, గాని వెల్వడనీయ,
దంతరంగమందె సంతసించు;
హాస్యమునకు కొంద రట్లు స్పందింతురు!
రసములందు హాస్యరసము మిన్న!

నవ్వు వలన గలుగు నాల్గు విధాల చే
టనుచు నమ్ముచుండి, హాస్య సుఖము
నష్టపోవుచున్న నరుల నే మనవలె?
రసములందు హాస్యరసము మిన్న!

పదవు లడ్డుపడవు, వయసు హోదా లడ్డు
కావు, రసహృదయము కలిగియున్న
చాలు, హాస్యమధువు గ్రోలవ చ్చెల్లరు!
రసములందు హాస్యరసము మిన్న!

బాధ లెన్నియున్న, పాత్రలో లీనమై
హాస్య మభినయించునట్టి నటుని
మెచ్చుకొనుట లెస్స నచ్చిన ప్రేక్షకుల్
రసములందు హాస్యరసము మిన్న!

రచనలందుహాస్యరసము లేకున్న, జీ
వితమునందు హాస్యచతురు డగుట,
కీర్తి గొనె తె.రామకృష్ణ-వికటకవి!
రసములందు హాస్యరసము మిన్న!

చాటు రచనలందు సరస హాస్యోక్తులు
పుష్కలముగ గలవు; పూర్వ కవుల
చిన్న పెద్ద లెల్ల చెప్పిరి చాటువుల్
రసములందు హాస్యరసము మిన్న!

శతక రచనలందు శ్రుతిమించి యుండె హా
స్యమ్ము; పూర్వ కవులు, ఆధునికులు
వ్రాసి శతకములను రాశులు పోసిరి!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యమునకు చుట్టమౌ నధిక్షేపము,
పోలికలును గలవు చాలవరకు;
కాన వేరుపరచి కనుగొంట కష్టమౌ!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరేఖ ముఖమునందు కలిగియుండి,
క్రూరులై చరించువారు నుందు;
రట్టివారి వల్ల నగు హాని, బహుపరాక్!
రసములందు హాస్యరసము మిన్న!

అచట నచట నొకడు హాస్యోక్తులను 'పేల్చి'
ఒరుల మెప్పుపొంద నుత్సహించు;
నవ్వి 'తుస్సు'మన్న అతగాని స్థితి యేమి?
రసములందు హాస్యరసము మిన్న!

తాము 'జోకు' వేసి, తామె పెద్దగ నవ్వి,
విన్నవారు నవ్వకున్న గాని,
తృప్తిజెందు హాస్య ' దిగ్దంత' లుందురు!
రసములందు హాస్యరసము మిన్న!

నవ్వలేడు తాను, నవ్విన నితరులు
విని సహించలేడు, వింత జీవి;
హాస్యరస 'మెలర్జి'(విరోధి), అతని కా రోగమ
రసములందు హాస్యరసము మిన్న!

నరుడు కోరుకొనును నవ్వుచు బతుకంగ,
కోరు నెవ్వ డేడ్పుగొట్టు బతుకు?
అంకురించు నవ్వు హాస్యమందునె కదా!
రసములందు హాస్యరసము మిన్న!

యూనివర్సిటీలు యోచించి నెలకొల్ప
వలయు హాస్యపీఠము లొక కొన్ని;
ఫలిత ముండు వాని వలన నెంతేనియు!
రసములందు హాస్యరసము మిన్న!

నాటు హాస్యమునకు, నీటు హాస్యమునకు
నడుమ గలదు దవ్వు; నవ్వుకొనగ
స్వాగతించవలయు సభ్య హాస్యమ్మునే!
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యచతురు లుందు రందందు,వా రున్న
చోట హాస్యలహరి పోటులెత్తు;
నట్టివారి మైత్రి నాశింతు రెందరో!
రసములందు హాస్యరసము మిన్న!

నవ రసమ్ము లనుట వ్యవహారమం దుండె,
పది రసమ్ము లనెడు వారు గలరు;
హాస్యరసము నెల్ల రంగీకరింతురు!
రసములందు హాస్యరసము మిన్న!

జీవితమున హాస్య మావశ్యక, మ్మది
లేని బతుకు ఉప్పులేని పప్పు;
చప్పనైన బతుకు సార్థక మ్మెట్లౌను?
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము బతుకునందు లేదేని, సాం
బారు లేని విందు తీరె యగును;
తృప్తి నిడదు విందు లేకున్న సాంబారు!
రసములందు హాస్యరసము మిన్న!

సాహసముల జూపు 'సర్కస్సు' లందు 'జో
కర్ల' హాస్య ముండు గాదె! ప్రేక్ష
కుల హుషారుగొలుప గలవారు జోకర్లె!
రసములందు హాస్యరసము మిన్న!

జానపద పదము(కవిత)ల లోన చిప్పిలుచుం
నందరికిని నచ్చు హాస్యరసము;
హద్దుమీరుటయును నందందు కననౌను!
రసములందు హాస్యరసము మిన్న!

నవ రసాలలోన నాకు బాగుగ నచ్చి
నట్టి, మెచ్చు రసము హాస్యరసము;
కాన వ్రాసినాడ దానిపై శతకము,
రసములందు హాస్యరసము మిన్న!

హాస్యరసము గూర్చి అంతొ యింతో పాఠ
కులకు నేను చెప్పగలిగినాడ;
ఆపవలసె శతక మగుట నియ్యది యింక!
రసములందు హాస్యరసము మిన్న!

చదువరులకు 'హాస్య శతకము' నచ్చిన,
కవిగ సంతసించ గలను నేను;
సెలవుగొందు నింక, శ్రీరస్తు! శుభమస్తు!!
రసములందు హాస్యరసము మిన్న!

సరళమైన సుమధురగీతాలు



కవితకు రాగం తోడైతే మరింతగా వెలుగొందుతుంది. గేయం, గీతం ఏదయినా జన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. కవిత్వం చదివి అర్థం చేసుకుంటూ తిరిగి జ్ఞాపకం చేసుకునే సంఘటనలు చాలా అరుదు. పాట ఏదయినా గుర్తుండటం సులభం. యువకవి కోటేష్ రచించిన ఈ సుమధుర గీతాలు ఎంతో సరళంగా, భావయుక్తంగా ఉన్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఏ కవికైనా తన మొదటి కవిత అమ్మపైనే ఉంటుంది. తాను రచించే కవితల్లో చాలా భాగం అమ్మ అనురాగమే చోటుచేసుకుంటుంది. అందుకు తార్కాణం నాల్గవ సంపుటిలో తొలిగా చోటు చేసుకున్న ఈ అమ్మ గీతం. అమ్మ పదంలో అనురాగం, మహాత్మ్యం, జగత్తు, సహనం ఉన్నాయంటూ రచించారు. అలాగే మల్లెకన్నా తెల్లని మనసని, ఔన్నత్యం దాగుందని, స్వచ్ఛమైన, పవిత్రమైన సంగమం లాంటిది అమ్మ మనసంటూ రచించారు. అమ్మ అనే పదానికి పర్యాయపదం లేదు. అమ్మ అమ్మే.. అనడానికి నిదర్శనం ఈ గీతం.

అమ్మ తర్వాత మనలో ఎవరికైనా గుర్తుకొచ్చేది నాన్న. అలా గుర్తుకు వచ్చారేమో కోటేష్ కు అందుకే "నాన్నేరా ! నీకు నడక నేర్పిన గురుదేవుడు" అంటూ మరో గీతం రచించారు.

"పలికింది రాగాల వీణా/ తానె పలికించేను తెలంగాణా/ ఆటపాటల ఉద్యమాల బాట/ తూర్పున సూర్యుడు, పడమట ఉదయించి/ బానిస బందాలు తెంచారులే/ అసురుల త్యాగాలు నిలిపారులే" అంటూ మరో గీతం తెలంగాణ తల్లిని ఆవిష్కరించేరు.

ఇలా "తాటికల్లు అమ్మేటోడా/ తంటాలెన్నో పడేటోడా" గీత కార్మికుని కష్టాన్ని తెలియజేసారు. మరో గీతంలో "ఈ విశాల విశ్వంలో మనిషి మనుగడేమౌతుందో" అంటూ వాపోతారు. యాదవుల పనితీరును మరో గీతంలో తెలిపారు. "నా జాతి తెలుగురా.. నా భాష తెలుగురా/ తెలుగు వెలుగురా/ తెల్లబోకురా/ మధురమైన భాషరా/ తెలుగు యాసరా/ మమత సమతను పెంచు తెలుగు భాషరా" అంటూ తెలుగు భాషను కొనియాడారు.

గీతం అనేది పదిమంది పాడుకునే తీరులోనే తమ గొప్పదనాన్ని, భాషా ఔన్నత్యాన్ని వ్యక్తీకరణ లోతుల్ని స్మృశిస్తాయి. కోటేష్ వీటికి చక్కని బాణీలు కట్టి పాఠశాలలకు అందిస్తే బావుండుననిపిస్తుంది. ఎందుకంటే నేటి పిల్లలకు భాష, తెలంగాణ జీవితంపై అవగాహన, సమాజంలోని ఎంతోమంది కష్టజీవుల చిత్రీకరణ, అమ్మనాన్నలకు ఉన్న విలువ, గురువు పట్ల గౌరవం, భూమాత పట్ల భక్తి, దైవ భక్తి, నిరుద్యోగానికి అర్థం, చదువు జీవితానికి ఎంత అవసరం? అనే అంశాలు అవగాహనకు వస్తాయి. చిన్నతనంలో రాగంపై ధ్యాస ఉన్నా, కొన్నాళ్ళకు వాటి అర్థం, అంతరార్థం తెలుస్తాయి. ఈ గ్రంథానికి దార్ల వెంకటేశ్వర రావు గారు కూలంకుషంగా కోటేష్ గ్రంథాలను వివరించారు. అలాగే సినీగేయ రచయిత కందికొండ గారి తొలిపలుకులు కూడా ఎంతో విపులంగా తెలిపారు. మరెన్నో గీతాలను రచించాలని కోరుకుంటున్నాను.

ప్రతులకు: గజ్జి కోటేష్, ఫోన్: 99512 13860

-శైలజామిత్ర
9290900879

పుస్తక సమీక్షలు

"గోండ్వానా లాండ్ ఎంత ప్రాచీనమైనదో తెలుగు అంతే ప్రాచీనమైనది



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారి సందేశంతో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి "నా"నుడి అంటూ చక్కటి విలువైన ముందుమాటలతో పుస్తకం ప్రారంభమౌతుంది. దాదాపు 70కిపైగా పుస్తకాలు అంతర్జాల సమాచారం.. వికీపీడియాలతో పరిశోధి ంచి ఈ పుస్తకం రాసారు.

తమిళనాట తెలుగు పల్లె కతలపై పరిశోధన చేసి పి.హెచ్.డిని ద్రావిడ విశ్వ విద్యాలయం నుండి పొందిన డా॥సగిలి సుధారాణి ఈ పుస్తకం రాయడం గొప్ప ప్రయోగం. తెలుగువారి మూలాలను పరిశోధించి **"గోండ్వానాలాండ్ ఎంత ప్రాచీనమైనదో తెలుగు కూడా అంతే ప్రాచీనమైనది"** అనే అంశంపై పరిశోధించి రాయడం గొప్ప విషయం. దాదాపు 7 ఖండాలు.. గల భూమి ఒకప్పుడు రెండు భాగాలుగా వుండేది. ఈ గ్రంథం మొదటి అధ్యాయం లో గోండ్వానా లాండ్ ఆఫ్రికా ఖండం- తెలుగు మూలాలు లెమూరి యం- మడగాస్కర్- మారిషస్- గురించి రాసారు.

ఆస్ట్రేలియా ఖండంలో న్యూజి లాండ్- ఆస్ట్రేలియాల్లో తెలుగు మూలాలు-ఆసియా ఖండాల్లోని తెలుగు మూలాలుగల జావా- మలేసియా- కాంబోజు (కంపూచియా) బర్మా, శ్రీలంక ఫిలిప్పీన్స్‌లో స్థితిగతులు గురించి ప్రపంచ భాషా కుటుంబాలు.. తెలుగు భాషలపై ఇతర భాషల ప్రభావం... శాసనాలలో తెలుగు స్థానం- లిఖిత సాహిత్యంలో తెలుగు అంశాల్ని విశ్లేషించారు.

గోండ్వానా లాండ్ అంటే ఆస్ట్రేలియా/ అంటార్కిటికా/ ఆఫ్రికా/ ఆసియా ఖండాలు ఒక్కటే నేలగా ఉండేవి. తెలుగు మూలాలు గురించి చక్కటి విశ్లేషణ ఫోటోలతో ఉన్నాయి. 'తెలగం సంతతికి చెందిన వారు తెలుగులని' ఆరుద్ర విశ్లేషించారు. గోండులజాన పదగాథలో గోండుల మూల పురుషులగు టీకం/మరకం/పూనం తెలగం- ఈ తెలంగం సంతతివారే తెలుంగులో అనేది విశ్లేషణ.

కాంభోజు (కంపూచియా) చంపా (వియత్నాం), అయోధ్య, సామ్రజ్యాలను పాలించిన శైలేంద్రరాజులు మన కళింగ దేశ సంతతివారే (పే.35)

ద్రావిడ భాష కుటుంబం.. వ్యాప్తి- క్రీ.పూ. 1500 కాలం స్థితిగతులు.. ఎన్నో వివరాణాత్మకంగా విశ్లేషించిన గొప్ప గ్రంథం ఇది.

ప్రతులకు:
తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభవన్,
రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్-500 004.

- తంగిరాల చక్రవర్తి
సెల్: 9393804472

ప్రేమతో బంధించు

ఎందుకలా పెడరెక్కలు
విరిచి కట్టుకుని సాగిపోతున్నావు
స్వేచ్ఛా చేతులను
ఇచ్ఛా హస్తాలు ఆశ్రయిస్తాయనా!

ఎందుకలా చుట్టూ కంచె కట్టుకుని
చూపు సారిస్తే సాయమడుగుతారని
కంట్లో శుక్లాలు పెంచుకుని
దృతరాష్ట్రుడిలా సంచరిస్తావు

చుక్క నీరు పోయకున్నా పెరిగి
తన బిడ్డల కండతో నీ కడుపు నింపునే తరువు
బీడులోని గడ్డిమేసి నీ గూడు చేరి
కడివెడు పాలనిస్తుందే పశువు

మాటలు నేర్చిన నీకు
వాదాలతో వివాదాలెందుకు
మనసు తలుపును ఛేదించి
విలువలున్న ఫలాలను వెదజల్లు

సాటి మానవులే కాదు సుమా
ప్రకృతిలో ప్రతిప్రాణి నీ బంధువే
సహాయమందించే ప్రతి చేయి
నారాయణుని ఆపన్నహస్తమే

రాలిపోయే రోజేదో తెలియని బ్రతుకు
వాలిపోయే లోపే నలుగురికి ఉపయోగపడు
మానవవాదానికి, మానవతావాదానికీ
అతీతమైన ప్రేమవాదంతో పరిభ్రమించు.

–శింగరాజు శ్రీనివాసరావు
9052048706

శాంతి ఒప్పందం

పర్యావరణ ప్రకోపం
జీవావరణానికే శాపం
ప్రకృతి హరితవస్త్రాపహరణం
విపత్తుల విజృంభనకు ఊతమే !

ప్రకృతి సహజత్వాన్ని దోచడం
తన బొంద తానే తవ్వుకోవడం
గాలికి గరళ గత్తర పుట్టించడం
ఊపిరి అందక చావును వెదకడమే !

మట్టి మర్యాద మంటగడపడం
తుది శ్వాస ఆహ్వానానికి ఘంటారావం
నీటి నియతిని నీరు కార్చడం
గొంతెండి జల సమాధి కావడమే !

అటవీ సంపద హరించడం
మృగాలు జనసంచారంలో తిరగడం
జలంతో ప్లాస్టిక్ భూత స్నేహం
మిలియన్ జీవులు అంతరించడమే !

నిర్దాక్షిణ్యంగా చెట్లు నరకడం
కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవడం
కార్బన్ పొగలు వదలడం
బతుకులు బుగ్గిపాలు కాడడమే !

అందుకే నవ్య 'మానవా'...
ప్రకృతి మాతకు హరిత వస్త్రధారణలు
పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణలు
తరగని ఇంధనాల పట్టాభిషేకాలు
సాగర కాలుష్య వ్యతిరేక ఉద్యమాలే !

భూదేవి ఊపిరితిత్తులేగా అడవులు
అమృత ఆయువేగా ప్రాణవాయు గాలులు
అన్న వితరణశీలులేగా నేల తల్లి పొరలు
జల స్వచ్ఛతలేగా ఆరోగ్య సౌభాగ్యాలే !

ప్రకృతిమాతతో శాంతి ఒప్పందాలు
పర్యావరణహిత నర కదలికలు
జీవావరణ రక్షణకే మానవ హారాలు
మహావిపత్తులకు మంగళం పలకడమే !

– డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037

అశ్రుధార...!

కరొనపేరుతోడకడుదోపిడాయెను
మమతమర్చిపోయెమనిషినేడు
అంతకంతనరుడునాశలలోబడి
ధరలుబెంచగానుధర్మమౌనె!!

రోగబాధలన్నిరోయకభరియించి
ప్రాణభీతిమించెపరగజూడ
ఆక్సిజన్లపేరనరగదీసిరిసొమ్ము!
శవములిచ్చిపరమషందులిలను!!

కరొనపీడనంబుకలచినలచివేయ
లక్షలాదిడబ్బులక్షణముగ
బీదబిక్కియనకపీడించిదోచిరి
ఉన్నమధ్యవాళ్ళవునికిజూచి!

కడుపులోనిగోసకన్నీటిజాడలు
ఆవిరైయ్యిపోయెనరసిజూడ
ఊపిరాడనిప్రజవునికికోల్పోవగ
గంగలోనద్రోయఘాతుకంబు!

తల్లిపిల్లలంతతపియించిపోయిరి
తండ్రికొడుకులంతదారితప్పి
కరొనవిషపువేటగాటుకిలనుజూడ
కాలిపోయిరిలనుకాటియందు!

ఇంటియింటికొకరినింపుగజంపియు
మనుషులందరికిలమాటువేసి
మానవులకుమధ్యమానవీయత్లేక
ఆటలాడుకరొనయాపదందు!

పాపభీతిలేదుపరగలోకంబున
నీతిహీనులైరి నిజముజూడ
కళ్ళుదెరచినేడుకనుమునిజములన్ని
అదుపుతప్పమనకునశ్రుధారె!

–డా.గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

బాల గేయ లహరి...

పుస్తక సమీక్ష



కవి, రచయిత, విమర్శకులు... బాల సాహితీవేత్త.. గుళ్ళపల్లి తిరుమలకాంతి కృష్ణగారి కలం నుండి జాలువారిన బాలగేయాలను ఏర్చి, కూర్చి "ఊయల" పేరుతో ఓ చిన్ని గ్రంథం వెలువడింది. "నలువరాణి శతకం" "దృశ్యభాష" గ్రంథాలతో సాహితీలోకానికి పరిచయమైన కాంతికృష్ణగారు బాలల మనోవికాసం కోసం.. వారి సర్వాంగీణ ఉన్నతి కోసం.. "ఊయల" బాలగేయ సంపుటిని ప్రకటించడం ప్రశంసనీయం. చాలా కాలంగా బాల సాహిత్యం సృజన చేస్తున్న కాంతికృష్ణగారు.. "ఊయల"లో 39 గేయాలకు చోటుకల్పించారు.

ఆట-పాట అంటే ముచ్చట పడే పిల్లలను దృష్టిలో పెట్టుకుని గానయోగ్యంగా.. అభినయం చేయడానికి వీలుగా కవి ఇందులో తమ రచనా ప్రతిభను ప్రదర్శించారు.

"తొలివేల్పు" గేయంలో విఘ్నేశ్వరుడిని తలుచుకున్నారు. "వీణాపాణి" గేయంలో జ్ఞానామృతాన్ని అందించే శారదామాతను కొలిచారు. అమ్మ యొక్క ఔన్నత్యాన్ని చాటుతూ.. 'అమ్మ' గేయాన్ని రూపుదిద్దారు. అందరాని చందమామను అద్దంలో చూపే అమ్మ మనల్ని కనురెప్పగ కాచునంటూ అమ్మ పట్ల గౌరవ ప్రపత్తులు పిల్లలకు అలవర్చుకునేలా ఈ గేయాన్ని రాశారు.

"మమతను పంచును నాన్న
సమతను నేర్పును నాన్న" అంటూ "నాన్న" గేయాన్ని ప్రారంభించారు.

ఆ తర్వాత ఈ సంపుటిలో అమ్మ,నాన్న తర్వాత అత్యంత ఆరాధనీయులైన 'గురువు'పై బాలగేయాన్ని పొందుపరిచారు. విజ్ఞానాన్ని పంచే గురువుగా వివేకాన్ని పెంచే గురువుగా వివరించారు. తాను ఏ స్థితిలో ఉన్నప్పటికీ.. పిల్లల ప్రగతే కోరుతాడని తెలిపారు.

'సూర్యుడు' ప్రత్యక్ష దైవంగా అందించే సేవలను ఏకరువు పెడుతూ మరో గేయం రాశారు.

భాషలెన్ని నేర్చినా.. మరువరాదు మన భాషనంటూ హితవు పలుకుతూ "అమ్మభాష" గేయాన్ని రాశారు. తెలుగు భాష గొప్పదనాన్ని తెలుపుతూ మరో గేయం రాశారు.

పాఠశాల గొప్పదనాన్ని చిన్నారులకు తెలిపే విధంగా తీర్చి "సాగిరండి" గేయాన్ని రాశారు. సర్కారు బడికి మీరు సంతసంగా సాగి రండి అంటూ పిలుపునిచ్చారు.

ఎండాకాలం సెలవుల పిదప మళ్లీ బడులు ప్రారంభమయ్యే సన్నివేశాలను "చదువుల మేళం" గేయంలో పొందుపరిచారు. "ఎందుకు?" గేయంలో ఆటంటే మాకిష్టం,పాటంటే మాకిష్టం, ఆటపాటలతో చదువును నేర్పించరు ఎందుకు? అంటూ మంచి ముగింపునిచ్చారు.

"విద్య..వినయం" గేయంలో విద్య వల్ల వినయం వెలుగొందగలదని పేర్కొన్నారు.

పోటీ పడుటయే ఆనందం.. గెలుపును పొందుటే ఆనందం అంటూ "ఆనందం" గేయాన్ని రాశారు. ఈ గేయం ద్వారా చిన్నారుల్లో సద్గుణాలను నింపేందుకు కవి కాంతికృష్ణగారు చేసిన ప్రయత్నం ప్రశంసనీయం.

వివిధ రకాలైన ఆటలను పరిచయం చేస్తూ "ఆటవిడుపు" గేయాన్ని తీర్చిదిద్దారు.

కలలు కనండన్న కలాం సందేశాన్ని గుర్తు చేస్తూ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా "కలాం" గేయాన్ని రాశారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌లను పరిచయం చేస్తూ రాసిన గేయాలూ బాగున్నాయి. రక్షకభటులు కార్మికుల గురించి రాసిన గేయాలు పారులు, నెలరాజు.. గలగల గజ్జెలు.. మధురము.. అమ్మకానుకు.. బతుకమ్మ , తొలకరి, చకచకబడికి, కల తదితర శీర్షికలతో రాసిన గేయాలూ ఆలోచనాత్మకంగా పిల్లల వికాసానికి దోహదపడేలా కొలువుదీరాయి.

ఆయా గేయాలకు సరిపడా.. పచ్చిమట్ల పవన్‌గీసిన బొమ్మలు బాగున్నాయి. బాల గేయాలు.. బాలలకు సులభంగా అర్థమయ్యేలా కవి కాంతికృష్ణగారు ప్రయత్నించినప్పటికీ.. కొన్ని గేయాల్లో పిల్లల స్థాయికి సరిపడని పదబంధ ప్రయోగం చేశారు.

పిల్లల స్థాయికి వెళ్లి బాల సాహిత్యం సృజన చేయాలన్న సంగతి కవి కాంతికృష్ణగారికి తెలియందికాదు. అయితే.. ఆయన తన మాటలో వీటిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పిల్లలకు ఎక్కువగా ఉపయోగ పడతాయని మనకున్న సందేహ నివృత్తి చేశారు. సాధారణంగా శిశు నుండి రెండో తరగతి వరకు చదివే పిల్లలకు ఉపయుక్తంగా వుండేలా విరివిగా బాలసాహిత్యం వెలువడాల్సి ఉంది. ఈ దిశలో సిద్ధిపేటలకు చెందిన బాల సాహితీకారులు చేస్తున్న కృషిని గుర్తు చేసుకుందాం. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పిల్లలు చదవడానికి ప్రోత్సహించే ఆకాంక్షతో దీన్ని తీర్చిదిద్దిన కవి కాంతికృష్ణగారికి అభినందనలు తెలియజేద్దాం.

ప్రతులకు: గుళ్ళపల్లి కవితకాంతికృష్ణ
16-16, చేర్యాల, సిద్దిపేట జిల్లా

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

కుంటిదైపోయింది

బ్రతుకు పిల్లల్ని కనడానికి
ఎగిరిపోయే సైబీరియన్ కొంగల్లా
నూతన ఉపాధికై ఎదురీదిన
అనాథ్రోమస్ చేప పిల్లల్లా
వలస అనివార్యమై వెళ్ళిన జీవులు

ఆకలి తీర్చుకున్న పట్నం వెలివేసినప్పుడు
ఖాళీ కడుపుతో నిలువనీడలేక
ఆశ్రయం కోల్పోయి...
చావైనా, బ్రతుకైనా అమ్మవడిన చేరి
పుట్టిన మట్టిలోనే
తనువు చాలించాలని ఒక్కటే ఆశ.

ఆశఊపిరి ఆవిరై,
రెక్కల సత్తువ సన్నగిల్లి
అశ్రువులు ముంచేస్తుంటే...
నేటి ఆధునిక సాంకేతికత అభయ హస్తాన్ని
అందించలేక మొఖానికి నల్లరంగు పూసుకుంది
నిరాశ్రయులైన కాళ్ళకు
పాదుకలు చేర్చలేక
కుంటిదైపోయింది.

కనిపించని పురుగు
కొగిలించుకోకమునుపే
రెక్కలు కట్టుకుని
సొంత గూటికి చేరుకోవాలని
ఎగిరిన వలస పక్షులు,
నాగరికత నదిలో మునిగి
మృత్యువును చేరుకున్నప్పుడు
అనాగరికం కూడా కన్నీళ్లు పెట్టుకుంది.

–శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

మణిదీపం ఆమె

ప్రతి ఇంటికి మణిదీపమై
సకలకళల కళాభినేత్రియై
ఆదిశక్తి అవతారమై
ప్రేమకు మరోరూపమై
విధాతకే జన్మనిచ్చిన
మాతృమూర్తి ఆమె...

కరుణచూపే కారుణ్యమూర్తియై
అన్నపూర్ణదేవి ఆరోప్రాణమై
పంచభూతాల శక్తిస్వరూపిణియై
ఇలపై వెలసిన దేవతరూపమే ఆమె...

చెరగని చిరునవ్వు చిరునామాగా
అలసటే ఎరుగని మోముతో
దయాహృదయమై నిలిచిన
ఆమూర్తిని చూచిన
మదిలోన హాయి కలిగించే
గుండెగుడిలోని దైవం ఆమె...

పుట్టినిల్లుకు మణిహారమై వెలుగుతూ
మెట్టినిల్లుకు మేలిమిముత్యమై
విలువపెంచుతూ
పిల్లల భవితకు నీడనిచ్చే తరువై
బంగారుకలలను నెరవేర్చేందుకు
దారిచూపే రవికిరణమై
వెలుగొందేది ఆమె...

బడబాగ్నిలా గుండెమండుతున్నా
చల్లని చూపుల విరిజల్లె
మలయమారుతాన్ని తలపించే
తన ప్రేమ జడివానలో
ముంచేసే అమృతమయమూర్తి ఆమె...

ప్రాణంపోయేలా ఉండే
పురిటినొప్పులు భరించి
రక్తమాంసాలకే ఊపిరిపోసి
ఒకరూపంలో ఈలోకానికి
తీసుకువచ్చే మరోబ్రహ్మ ఆమె...

మాటలునేర్పించి అక్షరాలు దిద్దించి
మానవతవిలువలు నూరిపోసే
ఆదిగురువు ఆమె...

ఎడారిలాంటి జీవితంలో
తోడుగా నీడగా ధైర్యంచెప్తూ
అన్నింటా వెన్నుదన్నుగా
నిలుచున్న చల్లనిచూపుల
దేవతైన నీలిచెలిమె ఆమె...

ఆమె గొప్పతనం గురించి
తెలియాలంటే ఆడపిల్లగా
జన్మించి అమృతనాన్ని
పొందితేనే తెలుస్తుంది
ఆమె అమృతమూర్తి అమ్మ..

–వలిపే సత్యనీలిమ
9502156813

ప్రాణదాత 'చెట్టు'

చెట్టు తన దేహాన్ని
సురగోళానికి అడ్డుపెట్టి
చేతులు చాచి చల్లని గొడుగై
మానవుడికి వినమ్రతను చాటుతోంది.

చెట్టు తన గుండెల్ని విప్పి
పక్షుల గూడుకు
గిజిగాడవుతుంది.

పచ్చని చెట్ల సందేశంతో
మనసున్న మేఘం గుండెలు కరిగి
వర్షమై విచ్చుకుంటుంది

చెట్ల పై ఉన్న పూల పుప్పొడి
మకరందాన్ని తుమ్మెద దోచుకుంటుంది
సోయగాలతో అలరిస్తూ తావి పంచుతుంది.

తరువుల నుండి రాలుతున్న పువ్వులు
ఆయుష్యను ముగించుకున్న పండుటాకులు
ధరణితనువుపై దుప్పటిని కప్పుతున్నాయి

చెట్లు రమణీయ మనోహర చిత్రమై
హరివిల్లు రంగులను పులుముకుంటుంది
స్వేచ్ఛగా తనువునిండా ప్రేమను నింపి
అమృతంవంటి పండ్లను అందిస్తుంది.

సువిశాల సృష్టిలో...
అలసి చెమ్మగిల్లి పోతున్న జీవులకు
ఆకుపచ్చని నీడై ఉసురును పోస్తుంది..
విశ్వానికి వెలుగుల కలయైతి నిలుస్తుంది..!

–కొండపాక శ్రీనివాస్
9866514972

నీతో(మ)రణమా

కాళ్ళు లేని కరోనా
ఖండాలన్నీ పరుగేనా
కనిపించని భూతమా
కరున లేని గాథమా!

అంటుకునుడే నీ మర్మమా
అంటించుకుంటే మా కర్మమా

సురాసుర వైరమా
అమరపీఠ సమరమా
దాయాదుల కయ్యమా
అందుకునే వియ్యమా
పంచుకునే రాజ్యమా

అంటుకునే భయమా
అంటుకుంటే అంతమా
మాపైనే నీ పంతమా

తెర లేసిన వైరస్ నృత్యమా
జరుగుతున్న అంకమా
అంపశయ్య మరణమా
తెలియని శాపమా
ఇది కరోనా కరాళమా
పోరాడుతున్న ప్రాణమా

కనిపించని కణమా
సంకటానికి కారణమా
నీవో యమ పాశానివా
నీతో (మా)రణమా!

–నా పి.బక్కారెడ్డి
9705315250

నాన్న

నాన్నంటెమిసిమి వెన్నెల
నాన్నంటెబతుకు స్రవంతి నాన్నపలుకులే
వెన్నపు ముద్దలు సుద్దులు
నాన్నతొలిగురువు హితుడును నాన్నకు దండాల్.

– రేడియమ్
సెల్: 9291527757

ప్రకృతిలో వికృతులు

ఆ చూపులతో వాడేంటి?
భయపెట్టే అహం ఏమిటి?

జేబుల్లేని చొక్కతో,
పేరుచివర తోకలేకుండా
చుట్టపు చట్రాలను వీడి
అహంకార అంతస్తు దిగి
ఒంటరిగా ఎదురైతేనేగా
నిజం తెలిసేది..
ఒట్టి మనిషి
గట్టి మనసుతో
తలపడే నిజాన్ని
కలపడే ఇజాన్ని
మట్టిలో కలబోసి
గాలిలో కలిపేసి
నీటిలో కడిగేసి
నెత్తుటిలో వడబోసి
శక్తులని ఒకటి చేసి
ప్రశ్నిస్తే...పరీక్షిస్తే
ప్రకృతిలో వికృతులైన
ఆ చూపు ఊపు ఏమిటో తెలిసేది.
ఆ అహం హద్దేమిటో తెలిపేది.



–చందలూరి నారాయణరావు
9704437247

ఇదేనోయ్ దేశభక్తి!

–వడిచర్ల సత్యం
7989511543

శ్రీకరముగ చదువడం
పరహిత మొనరించడం
ఇదేనోయ్! దేశభక్తి!
శ్రేయస్సును కోరడం!!

అన్నార్థుల నడుగడం
అవసరాలు తీర్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
అండగ వెంటుండడం!!

బీదల గుర్తించడం
బాధల దొలగించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మోదం గలిగించడం!!

"ఉచితం" తగ్గించడం
ధరలనదుపు చేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
బడుగుల బతికించడం!!

పేదరికం మాపడం
పేటనలను తీర్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రేమసుధలు పంచడం!!

మర్యాదల నివ్వడం
మంచిచెడ్డ లడుగడం
ఇదేనోయ్!! దేశభక్తి!
మనుషుల ప్రేమించడం!!

మమతలసిరి పంచడం
గుండె ధైర్య మివ్వడం
ఇదేనోయ్! దేశభక్తి!
దుఃఖం దొలగించడం!!

కలుషమతిని కడుగడం
సుమతిగాను మార్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రగతివైపు నడుపడం!!

నీతిని పాటించడం
భీతిని తొలగించడం
ఇదేనోయ్! దేశభక్తి!
జాతిని రక్షించడం!!

వెన్నుదన్ను గుండడం
సంకటములు బాపడం
ఇదేనోయ్! దేశభక్తి!
పూలదారి జూపడం!!

అవినీతిని అణచడం
అజ్ఞానము మాపడం
ఇదేనోయ్! దేశభక్తి!
అలజడి తగ్గించడం!!

మొక్కలు నాటించడం
చెట్లుగ పెంచేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
పచ్చదనం నింపడం!!

స్వార్థమతిని విడువడం
సోమరితన ముడుగడం
ఇదేనోయ్! దేశభక్తి!
సూక్తిని పాటించడం!!
పిల్లల రక్షించడం
తల్లుల రక్షించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఎల్లలు రక్షించడం!!

చేయూతను ఇవ్వడం
ముందుకు నడిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రజలను కాపాడడం!!

మాస్కును దరియించడం
కరోన నటు తరుమడం
ఇదేనోయ్! దేశభక్తి!
చావును తప్పించడం!!

కరుణను కురిపించడం
కన్నీటిని తూర్పడం
ఇదేనోయ్! దేశభక్తి!
కలిసిమెలిసి వుండడం!!

అభివృద్ధిని చెందడం
అభినందన లందడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఆరోగ్యముగుండడం!!

కష్టము తొలగించడం
నష్టము సమకూర్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇష్టముతో చేయడం!!

గుడులను రక్షించడం
బడులను రక్షించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మడులను రక్షించడం!!

అందరితో కలువడం
ఆలోచన చేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
అనురాగం పంచడం!!

కుళ్లును కూల్చేయడం
కూడును సమకూర్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
కూర్మిని పంచివ్వడం!!

జనునిని మురిపించడం
జనులను నవ్వించడం
ఇదేనోయ్! దేశభక్తి!
జరతుల పోషించడం!!

సహకారం జేయడం
సన్మార్గం జూపడం
ఇదేనోయ్! దేశభక్తి!
సత్యం పచియించడం!!

సద్బుద్ధిని పెంచడం
సమోకమును దించడం
ఇదేనోయ్! దేశభక్తి!
సదా శాంతముంచడం!!

గురువును పూజించడం
పరువును పెంచేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
తెరువును పాటించడం!!

తరువును రక్షించడం
చెరువును కాపాడడం
ఇదేనోయ్! దేశభక్తి!
కరువును తర్మేయడం!!
తల్లిని ప్రేమించడం
తండ్రిని ప్రేమించడం
ఇదేనోయ్! దేశభక్తి!
తమ్ముని ప్రేమించడం!!

మల్లిని ప్రేమించడం
చెల్లిని ప్రేమించడం
ఇదేనోయ్! దేశభక్తి!
పిల్లిని ప్రేమించడం!!

చెట్టును పూజించడం
పుట్టను పూజించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మట్టిని పూజించడం!!

హింసను ఆపేయడం
హంసను పోషించడం
ఇదేనోయ్! దేశభక్తి!
కంసుని కాటేయడం!!

రంకును మానేయడం
బొంకును మానేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
మంకును మానేయడం!!

నవ్వులు కురిపించడం
పువ్వులు పూయించడం
ఇదేనోయ్! దేశభక్తి!
దవ్వులు చెరిపేయడం!!

సతమును యత్నించడం
హితమును చేకూర్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
మతమును రక్షించడం!!

గాయం మాన్పించడం
న్యాయం గెలిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ధ్యేయం నెరవేర్చడం!!

శుక్కును వదిలేయడం
శుభ్రముగను వుండడం
ఇదేనోయ్! దేశభక్తి!
శుభముల గాంక్షించడం!!

భ్రాంతిని తొలగించడం
శాంతిని నెలకొల్పడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇంతిని సేవించడం!!

కల్తిపనుల నాపడం
జనులమేలు కోరడం
ఇదేనోయ్! దేశభక్తి!
నిప్పులాగ బతుకడం!!

నమ్మకంగ మెలుగడం
సాయమునందించడం
ఇదేనోయ్! దేశభక్తి!
విలువలు పాటించడం!!

ప్రకృతికి మేల్జేయడం
ప్రగతిని సాధించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రమోదమును కూర్చడం!!

వ్యక్తిని రగిలించడం
యుక్తిని పుట్టించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ముక్తిని కలిగించడం!!
విజ్ఞానం బంచడం
వివేకులను పెంచడం
ఇదేనోయ్! దేశభక్తి!
విజేతలుగ మలచడం!!

తప్పును సరిదిద్దడం
ఒప్పును మెరిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మెప్పును సాధించడం!!

సేవలు గమనించడం
దాతల కీర్తించడం
ఇదేనోయ్! దేశభక్తి!
కృతజ్ఞతలు తెలుపడం!!

సృష్టిని గుర్తెరుగడం
రూపును శ్లాఘించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఈశునిదని నమ్మడం!!

రైతుకు తోడుండడం
కూలికి విలువివ్వడం
ఇదేనోయ్! దేశభక్తి!
జవాన్కు జై కొట్టడం!!

కవనసుధను తాపడం
కనులను తెరిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
కళలను బతికించడం!!

కనికరమును చూపడం
కలిమి కొంత పంచడం
ఇదేనోయ్! దేశభక్తి!
కలతలు తగ్గించడం!!

కదం దొక్కి కదలడం
కలుపును పీకేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
కర్మను పూరించడం!!

గౌరవమును ఇవ్వడం
గౌరవమును పొందడం
ఇదేనోయ్! దేశభక్తి!
గౌరవమును ఉంచడం!!

దుర్గుణాలు వదలడం
సద్గుణాలు పొందడం
ఇదేనోయ్! దేశభక్తి!
సుఖముగ జీవించడం!!

గాలిని రక్షించడం
నీటిని రక్షించడం
ఇదేనోయ్! దేశభక్తి!
జగతిని రక్షించడం!!

ఘనచరితను కాంచడం
ఘనతను మెరిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఘనసేవలు చేయడం!!

లోభములను విడువడం
క్రోధంబును విడువడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఈర్ష్యలన్ని విడువడం!!

నిర్భయముగ వుండడం
నిజాయితిగ మసలడం
ఇదేనోయ్! దేశభక్తి!
నియమముతో సాగడం!!
నమ్మకమును వుంచడం
గుండెబరువు దించడం
ఇదేనోయ్! దేశభక్తి!
"ఆశ"ను బతికించడం!!

దోపిడి నరికట్టడం
దాడుల నెదిరించడం
ఇదేనోయ్! దేశభక్తి!
హద్దులు రక్షించడం!!

భయమును పోగొట్టడం
నయమును హెచ్చించడం
ఇదేనోయ్! దేశభక్తి!
జయమును సాధించడం!!

దొంగను తర్మేయడం
లంగను బెదిరించడం
ఇదేనోయ్! దేశభక్తి!
బెంగను తీర్చేయడం!!

మరులను కురిపించడం
సరులను నడిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇరులను తొలగించడం!!

ఇడుముల కెదురీదడం
ఇల్లును పోషించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇంపగు కలిసుండడం!!

గర్వము నణచేయడం
పర్వము జరిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
సర్వము కాపాడడం!!

బుద్ధిని పెంచేయడం
శుద్ధిగ కొనసాగడం
ఇదేనోయ్! దేశభక్తి!
సిద్ధికి యత్నించడం!!

చాడీలను మానడం
వాస్తవాలు చెప్పడం
ఇదేనోయ్! దేశభక్తి!
బంధాలను నిలుపడం!!

పరనిందల నాపడం
పరముగ యోచించడం
ఇదేనోయ్! దేశభక్తి!
పరసేవకు బూనడం!!

పట్టు వదలకుండడం
నిత్యము శ్రమియించడం
ఇదేనోయ్! దేశభక్తి!
లక్ష్యశిఖర మెక్కడం!!

ప్రలోభాల నాపడం
ప్రశ్నలు మొలకెత్తడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రజాస్వామ్య మెదుగడం!!

తాయిలాలు తగ్గడం
జనులు నిజం తెలియడం
ఇదేనోయ్! దేశభక్తి!
"నోటుకోటు" పోవడం!

ముంపును ఎదిరించడం
కంపును తొలగించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇంపును స్థాపించడం!!

దళారీలు పోవడం
గిట్టుబాటు రావడం
ఇదేనోయ్! దేశభక్తి!
చమటచుక్క నవ్వడం!!

అబద్ధాలు మానడం
యదార్థమును చెప్పడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇంతింతై ఎదుగడం!

చిక్కుల విడిపించడం
కుక్కల శిక్షించడం
ఇదేనోయ్! దేశభక్తి!
లెక్కలు సరిజేయడం!!

నీవు, నేను కూడడం
నీతిగ చరియించడం
ఇదేనోయ్! దేశభక్తి!
నీచంబును దులుపడం!!

చిత్తం వికసించడం
చిరునవ్వులు చిందడం
ఇదేనోయ్! దేశభక్తి!
చిరాయువును పొందడం!!

తెలుగును బతికించడం
వెలుగును విరజిమ్మడం
ఇదేనోయ్! దేశభక్తి!
జిలుగును కాపాడడం!!

ఝురులను మళ్ళించడం
సిరులను పండించడం
ఇదేనోయ్! దేశభక్తి!
గిరులను రక్షించడం!!

అత్యాశను విడువడం
ఆశను సాగించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఆదర్శము గుండడం!!

దేవిగ భావించడం
తల్లిగ సేవించడం
ఇదేనోయ్! దేశభక్తి!
పుడమిని పూజించడం!!

స్మృతులను నెమరేయడం
కృతులను సృజియించడం
ఇదేనోయ్! దేశభక్తి!
శ్రుతులను వివరించడం!!

నిన్ను నీవె తెలియడం
నన్ను నేనె తెలియడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఇజ్జగాన్ని తెలియడం!!

వేదార్థము గ్రోలడం
పరమార్థము నెరుగడం
ఇదేనోయ్! దేశభక్తి!
జీవార్థము దెలియడం

నీ "చేత"ను నమ్మడం
నీ "రాత"ను నమ్మడం
ఇదేనోయ్! దేశభక్తి!
నీ "మాత"ను నమ్మడం!!

స్వార్థం వదిలేయడం
స్వార్జితంగ బ్రతుకడం
ఇదేనోయ్! దేశభక్తి!
స్వాగతంబు పలుకడం!!

కర్మను నెరవేర్చడం
మర్మమును గ్రహించడం
ఇదేనోయ్! దేశభక్తి!
ధర్మము వైపుండడం!!

అప్పును తగ్గించడం
ముప్పును ఎదిరించడం
ఇదేనోయ్! దేశభక్తి!
తుప్పును వదిలించడం!!
ఉపాధి జూపించడం
ఉత్పత్తులు పెంచడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఉన్నతులను చేయడం!!

ఉన్మాదము నణచడం
ఉద్వేగము నణచడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఉషస్సులను నింపడం!!

"వృథా"ను తగ్గించడం
పొదుపుగ జీవించడం
ఇదేనోయ్! దేశభక్తి!
సంతృప్తిని చెందడం!!

స్త్రీలను రక్షించడం
ప్రకృతిని వీక్షించడం
ఇదేనోయ్! దేశభక్తి!
సృష్టిమహిమ దెలియడం!!

వసతులు గల్పించడం
వలసల నరికట్టడం
ఇదేనోయ్! దేశభక్తి!
సుఖశాంతులు నింపడం!!

పాటవాన్ని చాటడం
పరీక్షలో నెగ్గడం
ఇదేనోయ్! దేశభక్తి!
పవిత్రంగ బ్రతుకడం!!

పదటంబును వదులడం
పనిదొంగని చూడడం
ఇదేనోయ్! దేశభక్తి!
పరమేశుని తెలియడం!!

"లాడి"ని మాన్పించడం
"దాడి"ని ఖండించడం
ఇదేనోయ్! దేశభక్తి!
"పాడి"ని బతికించడం!!

దళమును సమకూర్చడం
గళమును వినిపించడం
ఇదేనోయ్! దేశభక్తి!
బలమును చూపించడం!!

సమతను పాటించడం
సమస్యలను పూడ్చడం
ఇదేనోయ్! దేశభక్తి!
సఖ్యత జేకూర్చడం!!

మానవతను చూపడం
పుణ్యమింత జేయడం
ఇదేనోయ్! దేశభక్తి!
ప్రదాతలై వెలుగడం!!

మంచిమాట లాడడం
మధువును వొలికించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మనసును రంజింపడం!!

మోసములను కూల్చడం
దోషములను తేల్చడం
ఇదేనోయ్! దేశభక్తి!!
వేషములను పోల్చడం!!

మలినాలను కడుగడం
మత్తును వదిలించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మనీషిగను మలచడం!!

జ్ఞానకాంతి జల్లడం
జనులభ్రాంతి ద్రుంచడం
ఇదేనోయ్! దేశభక్తి!
మనశ్శాంతి పెంచడం!!

గతములోకి వెళ్ళడం
చరితను శోధించడం
ఇదేనోయ్! దేశభక్తి!
వైభవమును చాటడం!!

మన నేలను పొగడడం
మన జాతిని తలవడం
ఇదేనోయ్! దేశభక్తి!
మన సంస్కృతి నుంచడం!!

గతులను గమనించడం
యతులను పాటించడం
ఇదేనోయ్! దేశభక్తి!
మతులను పెంచేయడం!!

నేరములను ఆపడం
ఘోరములను మానడం
ఇదేనోయ్! దేశభక్తి!
దూరములను చెరపడం!!

కులమతాలు మరువడం
స్నేహముతో మెలుగడం
ఇదేనోయ్! దేశభక్తి!
ఒకే భావనుండడం!!

విద్యను ఆర్జించడం
లేనివార్కి పంచడం
ఇదేనోయ్! దేశభక్తి!
త్యాగనిరతి జూపడం!!

మాటమీద వు

కరోనా కాటు

సభికులెందుకు
సభ జరపడానికి
వేదిక వుందిగా..
మైకు పట్టుకుని
అతిథులుంటే చాలు.
కావలసినన్ని
ఫోటోలు.
పాపం!
ఏం రాయాలో తోచక
తలలు పట్టుకుంటున్న
పాత్రికేయులు!!

– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

మల్లెతీగ సాహిత్యవేదిక | తెలుగురథం
THE CULTURAL CENTRE OF VIJAYAWADA AMARAVATI

ఆహ్వానం

మంజు యనమదల రచన
చెదరని శిథిలాక్షరాలు
మంజు వాణి మనోభావాలు

గుప్పెడు గుండె సవ్వడులు

రెండు పుస్తకాల ఆవిష్కరణ

కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ & అమరావతి
1-7-2017 శనివారం సా॥ గం.5.30 ని॥లకు

4వ అంతస్తులో

శుక్రవారంరోజు శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ బాలగంగాధర తిలక్‌గారి జయంతి సభలో అతిథులు శ్రీమతి గుండవరపు గీతాదేవి, రమణ వెలమకన్ని, టి.యస్.టి.సి.యల్ పూర్వ ఛైర్మన్ దేవిప్రసాద్, కళా వి.యస్.జనార్ధనమూర్తి, బీజేపీ యువనాయకుడు వినయ్‌కుమార్, గుదిబండి వెంకటరెడ్డి.

నిత్యస్మరణీయులు

భర్తృహరి

-దోరవేటి
సెల్:9866251679

కవివో, యోగివో, సత్యదర్శనకువో, కర్తవ్య నిర్మాతవో
భువిలో ధర్మము, నీతి నిల్పిన యశఃపూర్ణుడవో పైదిక
ప్రవరాఖ్యుండవో, దేశికుండవో, మహో వైదుష్య రూపుండవో
సవిరళా! గుణభోగి! భర్తృహరి! విశ్వైకాభిరామ! నమో!

విక్రమార్క చ్రిత వీవను కథవింటి
మెంత వరకు నిజమె! యెరుగమయ్య
నతి 'యనంగసేన' నరిగ 'పద్మిషియో
నొజనని 'సుశీల' నిజమటయ్య!?

పురుషుని యాత్మనెరవము, పొరెడి శీర్షము, సంఘసేవ, స
చ్చరిత, పరోపకారము, యశస్సునకాంక్ష, విశేషకర్మముల్
నిరతము చేయు దర్పతను నింపెడి వక్కుట నీకవిత్వమున్
పరమ మనోహరంబగుచు వర్ధిలుచున్నవి నేటికిద్ధరన్.

గర్వమింత లేని ఘనుడవు, జీవితా
షరములన్ని శ్లోక సరములనగ
చదువులమ్మ మెడను సవరించినావయ్య
వందనములు చేయుచుందు మెపుడు!

మేధావి కవితలు

మేధల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 257వ రోజు 'మెదడు-ఆలోచనల కార్ఖానా' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'మెదడు-ఆలోచనల కార్ఖానా' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం యథాతథంగా అందిస్తున్నాం..

మేధల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

తానే సర్వం

మెదడు ఆలోచనల నిలయం
అవేదనలూ అనుభూతుల ఆలయం
నిరంతర ఆలోచనా స్రవంతి
నిత్యనూతన ఆలోచనా వేదిక
సదా చైతన్య శీలి
సర్వదా పరివర్తనా కేంద్రం.
నూతన ఆవిష్కరణల విజ్ఞాన వేదిక
విశ్వ కళ్యాణకారి తానే
విశ్వ విధ్వంసకారి తానే
సృష్టి కర్త తానే
సృష్టి వినాశ కారి తానే.
అద్భుతాలు సృష్టించ గలదు
ప్రేమకు నిర్వచనం చెప్పగలదు
దయకు దారి చూపగలదు
ఓదార్పు నివ్వ గలదు
ఓటమిని విజయంగా మలచ గలదు
మానవత్వ పరిమళాలు పూయించగలదు
దైవత్వ సుగంధాలు వెదజల్లగలదు
భగవంతుని మెప్పించ గలదు
భక్తిని ముక్తిగా మలచ గలదు
నిత్య సాధనతో
అసాధ్యాన్ని సుసాధ్యం చేయ గలదు.
ఆవేదనా సుడిగుండాలు మిగల్చగలదు
కుట్రలూ కుతంత్రాలూ పన్నగలదు.
కులమతాల పేరిట సమాజాన్ని చీల్చగలదు
కుటిల రాజకీయ ఎత్తుగడలను వేయగలదు
కుళ్లిన శవాలపై వ్యాపారం చేయ గలదు
తానొక
భయంకర వినాశకారి
స్వార్థ విష మహమ్మారి
తనను సక్రమంగా వినియోగిస్తే
మహాత్ముడవుతాడు
దుర్వినియోగం చేస్తే
విశ్వ వినాశకారి అవుతాడు.

– త్రివిక్రమ శర్మ,
9000392707

సమన్వయి

ఆమె ఆలోచనల కార్ఖానా
ఒక్కసారిగా అలా
ఖాయిలా పడుతుందని
ఊహించనేలేదెవరు..
ఎన్ని బాధలను
ఆ మస్తిష్కపు పొరల చాటున దాచిందో
ఎవరిని నొప్పియ్యని మాటతీరుతో
మౌనమే నయమని అనుకున్నా
పదే పదే గుర్తొచ్చే సంఘటనలతో
మనసును గాయపరచుకుందేమో
ఆ గాయమే ఉప్పెనగా మారడంతో
చిట్లిన సుతిమెత్తని
మాంసపు ముద్ద మొద్దుబారి
మనిషినే కదలనియ్యక
జీవచ్ఛవంగా మార్చింది
నిత్యం గలగల పారే సెలయేరులాంటి
తన మాటలను కొనసాగించడానికి
ఆలోచించని తనవారి తలలు లేవనుకో
ఆమె ఆలోచనల ధార ఆగిన క్షణంలో
అందరి చూపులు ఆకాశంవైపే సాగినా
చేయని ప్రయత్నం లేదు.
తెలివి ఎక్కువదో తక్కువదో
జ్ఞాపకాలు నిండినదో నిండనిదో
ప్రతి కదలికకు మార్గనిర్దేశం చేసే సమన్వయి
మనిషికి మాత్రం కావాలి తప్పనిసరిగా
అయినా
తానకు తాను కొంత నయం చేసుకునే
మెదడుకు
బయటి వైద్యం తోడై
అద్భుతమే జరిగింది ఆనాడు
అందుకే
ఇంటిల్లిపాదికి
ఆనందాల్ని పంచుతోంది ఈనాడు.

– శ్రీలతరమేశ్ గోస్కుల,
7013943368

మేధా మథనము

విజ్ఞాన వంతుడైన మానవుడి
నిరంతర మేధా మథనం
జ్ఞాన తృష్ణతో
కొత్త అంశాల ఆవిష్కరణ
విశాల విశ్వంలో
విశేష ప్రజ్ఞకు సుందర మార్గం మెదడు
ఎన్నెన్నో ఆలోచనల వల్లే
దేశ ప్రగతి లో భాగ స్వామి అవుతూ
తనకు, కుటుంబానికి కీర్తి ప్రతిష్టలు
ఎన్నో ఉత్తమ మార్గాలు
తన మేధా మథనం ద్వారానే ఊహలు
ఉన్నత స్థితి కోసమే ఎన్నో ఆలోచనలు
ఆ కోవలోనే
రచయితలు, కళా కారుల నిరంతర కృషి
ఎందరికో స్ఫూర్తి

-నారు మంచి వాణి
ప్రభాకరి,
9849481823

సానుకూలం

మెదడొక శరీర భాగం
అతి భద్రంగా కపాలంలో
భద్రపర్చి భద్రంగా వాడుకోమని
భగవంతుని ఆదేశం!
అదొక అమూల్య ఆభరణం
ఆలోచనలకు, భావోద్వేగాలకు నిలయం
అవయవాలు అన్నీ అధీనం
అదే లేకపోతే మనసు గల్లంతు
అసలు మనిషే గల్లంతు
నిర్విరామంగా పనిచేసే శ్రమజీవి
అందుకే
మంచి ఆహారం
మంచి నిద్ర
మంచి ఆలోచనలు
మంచి వాతావరణం
మనకీ మంచిచేస్తాయి.
పైవాటిలో లోపం
మనిషికి శాపం
చైతన్య శరీరం
మెదడుకు ఉత్తేజం, ఉత్సాహం.
మెదడు ఆలోచనల కార్ఖానా
కార్ఖానాలో వస్తువుల ఉత్పత్తి
మెదడులో ఆలోచనల ఉత్పత్తి
ఆలోచనలే మనిషికి మార్గదర్శకాలు.
ఉత్తమ ఆలోచనలు
ఉన్నతికి సోపానాలు
దురాలోచనలకి దూరమైతే
సదాలోచనలు సద్గతికి దగ్గర
ఆలోచన ఆచరణకి దారి
ఆచరణ ప్రవర్తనకి దారి
సానుకూల ఆలోచనలు
ముందుకు నడిపిస్తే
ప్రతికూల ఆలోచనలు
ప్రగతికి ప్రతిబంధకాలు!.

– మోటూరి శాంతకుమారి,
8106790978

భిన్న యోచనల ఉత్పత్తి కేంద్రం

మానవ మస్తిష్కం
విభిన్న యోచనల ఉత్పత్తి కేంద్రం
చిన్నమెదడు
పెద్దమెదడు
రెండూ సవ్యంగా పనిచేస్తేనే
సార్థక జీవిగా మిగులుతాడు
లేకుంటే పిచ్చివానిగా
ముద్ర వేయబడతాడు
అధ్యయనమే మెదడుకు మేత
ఖాళీగా ఉంచితే
దయ్యాల కొంప
సహవాస దోషాలు కూడ
మేదడుపై ప్రభావం చూపుతాయి
చిత్తం శివుని మీద
భక్తి చెప్పుల మీదన్నట్లు
ఆలోచనలు నిరంతరం
పరిభ్రమిస్తూనే ఉంటాయి
అన్నింటికన్నా వేగంగా
పరిగెత్తేవి ఆలోచనలేకదా
ఆలోచనలే
మనిషిని నిలబెడతాయి
పడగొడుతాయి
దురాలోచనలకు తావివ్వొద్దు
మనుషులకు దూరం కావద్దు
సద్గ్రంథ పఠనం
సత్సంగత్యం
సదాచారాలు
సద్బుద్ధినిస్తాయి
మనిషిని మంచి వ్యక్తులుగా
సమాజంలో నిలబెడుతాయి
విచక్షణ కోల్పోవద్దు
ప్రతి కూల పరిస్థితులను
దరి చేరనివ్వొద్దు
మర మనుషులుగా మారొద్దు
మెదడు నిమ్మలంగా ఉంటేనే
మంచి ఆలోచనలు ఉత్పత్తవుతాయి
నిత్యం ధ్యానం చేద్దాం
మెదడుకు ఉత్తేజాన్నిద్దాం
మంచి ఆలోచనలు చేస్తూ
మనుషులుగానే బతికేద్దాం.

-గుండం మోహన్ రెడ్డి,
9440161636

బ్రెయిన్-మెయిన్

బ్రెయిన్
మూడు లోబులు
మూడు పొండ్లు
వాల్నట్ ఆకారం
సుతిమెత్తని మాంసం
న్యూరాన్ల సమాహారం
దృశ్యాన్ని మథిస్తూ
విషయాన్ని విశ్లేషిస్తూ
జ్ఞాపకాలెన్నిటినో నిక్షేపిస్తూ
నాడీ కణ వాహనంతో
జ్ఞానం కలిగిస్తూ
పచ్చి మాంసపు ముద్ద
అధ్భుత సాఫ్ట్ వేర్
పెద్ద హార్డ్ డిస్క్
జీబీ, టీబీల లెక్కల కతీతం
నిరంతర ఆలోచనల
కర్మాగారం
మూలకణాల వృత్తం
న్యూరాన్ల జాలం
కపాల పేటికలో చలించక
విజ్ఞాన దీప్తి జ్వలింప చేసే
సూపర్ సానిక్ పవర్ బ్రెయిన్
సక్రమమైతే
విశ్వాన్ని ముస్తాబు చేస్తుంది
వక్రమైతే
నాశనం చేస్తుంది
బ్రెయిన్ ఈజ్ మెయిన్.

-జె.నరసింహారావు,
9490128690

నవమార్గము

కం. ఆలోచన లోచనములు
నీ లోపల లోతులెంచు నెమ్మది చూడన్
కాలము గమనము తోడుత
మూలమునకు మెదడు పనుల ముసురును కోట్లె!!.

కం. మెదడొక కార్ఖానావలె
పదునుగ పనిచేయ ప్రగతి భావ్యము తోచున్!!
సదయుల సహవాసమ్మును
హృదయములో జ్ఞానవృద్ధి కృషి ఫలితములౌ!!.

చం. మెదడుకు మేతగావలె సమీపమునందున పాలసంద్రమున్
వదలక చిల్కివెన్నసరిపావన సున్నితమౌ పదార్థమున్
కుదురుగతీయు కార్మికులు కూలిమనుష్యులు వందిమాగధుల్
మృదుమధురంపు మానసులు మేదిని మెచ్చెడు హంసరూపులున్!!.

ఉ. యంత్రము తంత్రముల్ నడుపు యాత్రికుడై పరదైవ భృత్యుడై
మంత్రము శస్త్ర శాస్త్రముల మాన్యతనెంచెడు శ్రామికుండునై
జంత్రమువోలి రాగముల శక్తిని పెట్టుచు శ్రావ్య గీతముల్
మాంత్రికుడాలపించు నవమార్గము నెంచుచు మేధతోడుతన్.

-మాడుగుల నారాయణమూర్తి,
9441139106

యోచన ఘనమా

కం. మనసొక ఊహా కేంద్రము
మనిషిని నడిపించు నిండు మమతల గూల్చున్
ఘన చరితను సృష్టించును
మన పతనానికి నిమిత్తమదియే జూడన్ !.

శా. అవ్యాజంబగు ప్రేమ, క్రోధములకున్, ఆనందమున్, తృప్తికిన్,
భవ్యాలోచనలంకురించు స్థలియౌ బాహ్యంపు చేతల్ గనన్
నవ్యాలంకృత చింతనల్ సతతమున్ నామంబు నిల్పున్ భువిన్
సవ్యాసవ్య విధానముల్ దెలియగన్ సంతృప్తమౌ యేరికిన్ !.

కం. థామస్ ఆల్వా ఎడిసన్,
రామన్, బాబేజు, బోసు, రాకేశ్శర్మల్,
రామానుజ, విశ్వేశ్వర,
హోమీ జాంగీరు బాబ యోచన ఘనమౌ !.

-సంతోష్ భూపతి,
9441712041

కంప్యూటర్

మానవ మేధస్సు
ఒక అద్భుతం
విశ్వాన్ని శోధన చేసి
ఆవిష్కరణల సాధన
కంప్యూటర్, మరమనిషి లాంటి
ఆవిష్కరణలెన్నో
పురుడు పోసుకుంది మాత్రం మెదడులోనే
సవాళ్లను, ప్రతి సవాళ్లను స్వీకరించి
నూతన పరిశోధనలకు బీజం.
మనిషి మస్తిష్కం
మంచిని చేయగలదు
చెడును చేయగలదు
ఫలితాలు వివేచన పై
ఆధార పడి ఉంటాయి
స్వార్థం వీడి
లోక కళ్యాణం కోసం
సైన్సు కు మానవత్వాన్ని జోడిస్తే
అద్భుతం
పరమాద్భుతం.

-శేషారావు,
9440408080

జ్ఞాపకాల బుట్ట

న్యూరాన్లు అల్లిన అందాల మూట
నులివెచ్చని ముచ్చటైన కంచుకోట
గట్లగట్ల మెత్తని మెట్లలో
గమ్మత్తైన మనసు ఊట
అనుభవాల పొత్తికడుపు
జ్ఞాపకాల అలలు పొంగెత్తే జలధి
సంఘర్షణల నెత్తుటి మడుగది
మనిషిని నడిపించే అనుభవాల అడుగది
ఒక నున్నని నిగనిగల కొవ్వుముద్ద
కోటానుకోట్ల కణాల సంగమం
సర్వ అవయవాల సంధానకర్త
తలపుల ప్రదాత
ఈ మహిమాన్విత మస్తిష్కం
చిన్నమెదడో పెద్దమెదడో
మనకు మూలనిధి
గమన జడత్వాల కళ్లాల గడుసువిధి
పాదరస ప్రాణస్వరమది
రుధిర ప్రవాహ వాన
ఆలోచనల కార్ఖానా
అనభవాల నెరజాణ
మనిషి సంతకం ఈ మస్తకం
ప్రతిభాపాటవాల ఊడ
మనిషి ఆశనిరాశల వాడ
అద్భుత ఇంద్రజాలం
ఈ మృదులకణజాలం
జ్ఞాపకాల బుట్ట
నెమరేతల్లో దిట్ట
జ్ఞాన అజ్ఞాన అలవికాని
అలలుదొర్లె చెలియలికట్ట
ఈ మతిమందిరం
ఓహో అతిసుందరం
మెదడంటే ఓ మిరాకిల్
దాని సద్వినియోగమే మనకు పెద్దపజిల్
ఏమని ఎంతని చెప్పను
అది ఉషారుగా వున్నంతవరకు
మనసుకి మహా వసంతమేగా
ఊసూరుమన్నదంటే
అంతేగా అంతేగా
మనిషికి ఆఖరి అంతమేగా
తలలో వుండి ఇలలో నడిపించే
మేధ నెలవంక
మనిషి కి పశుప్రపంచానికి
గీచిన విచక్షణరేఖ
సమస్తమానవ అనుభూతుల
విలక్షణవేదిక.

– నల్లగొండ రమేశ్,
8309452179

వృక్షో రక్షితః

మౌన మునిలా నిలిచి
మానవ ఉనికిని కాపుకాసే
మాకునై జగతిన జరిగే వింతలను
ఘోరాలను గమనిస్తూ ఉన్నాను !

మీరు బతికేందుకు విడిచిన
మలినవాయువుల్ని సంగ్రహించి
నా దేహాన్ని కప్పిన పత్రాల
హరిత యంత్రాంగ క్రియలతో
ప్రాణవాయువుగా మార్చి
మీకు ఊపిరిని అందిస్తూ మీ
బ్రతుకును మీకే దానంచేస్తున్న దాన్ని!

నా చల్లటి ఛత్ర ఛాయలో మీ గత
బాల్యపు ఆటల్ని, కేరింతల్ని
నిధులుగా దాచిఉంచాను మీకోసం
తవ్వుకుని తనివితీరా మురిసిపొండి
మీ నూనూగు యవ్వనపుతొలిప్రేమ
కథలను చెరిగిపోని గుర్తులుగా నా
ఒళ్ళంతాచెక్కిదాచింది మరిచారా?

దారిపక్కచెట్టునై అలసిన శరీరాలకు
సేదతీర్చిన అమ్మ ఒడిని నేనే కదా
గూడులేని నిర్భాగ్యులకు తోడై
నీడనిస్తున్న కల్పవల్లిని
మీ ఆకలిని తీర్చే అన్నపూర్ణను
వివిధ ఫలాలను అందిస్తున్న
అమృత వల్లిని నేను కాదా?

బడుగు బ్రతుక్కి ఇంటినై..
ఉన్నవాడి భవంతిలో అందాల
నగిషీల వయ్యారాలొలక బోసేది..
చివరికి మీ మరణాన దహనానికి
కట్టెలై మీతో కాలి బూడిదయ్యేది
మీజీవితాంతం మీ
జీవనానంతరం మీ
తోడుగా నిలిచేది నేనే కదా!

స్వార్థంతో నా జాతిని నరికేస్తూ
పచ్చదనాన్ని నిర్దయగా హరిస్తూ
స్వచ్ఛ గాలుల్ని కలుషితం చేస్తూ
నేలను, నీటిని, పీల్చే గాలిని
మలినపరుస్తూ మనుగడకే
ప్రమాద ఘంటికలు మ్రోగిస్తూ
ఋతువుల గమనాన్ని చెరిపేస్తూ
కరువులు, కాటకాలు,
అకాల వర్షాలు, మండే ఎండలు
వరదలు,ఉప్పెనలు,భూకంపాలు
కోరితెచ్చుకుంటూ మరుగైపోయే
ఓ మనిషి ఇహానైనా
కళ్ళు తెరిచి నీకోసం బ్రతికే
నన్ను బ్రతికించుకో
నిన్నునీవు రక్షించుకో..

-డా. కె. దివాకర చారి
9391018972

క్వారంటైన్

అలసిపోయి అదే చెట్టున
చతికిలపడ్డ గొడ్డలికి
ఇప్పుడు తెలిసొచ్చింది ఆక్షిజన్ విలువ !
అదేంటో విచిత్రంగా–
దిగుళ్ళ మంచాన ఊపిరి సలపనపుడే
ఇన్నేళ్లుగా ఏ మంద్రమారుతాలో,
ఏ లేదామర వీచికలో
ఎలా మన తలలు నిమిరాయో
తెలిసోస్తుంది!
శ్వాస సన్నగిల్లిన గుండెలు
బరువెక్కినపుడేగా
నిండుమనసుల
ఊయలల విలువలు తెలిసొచ్చేది!
పనిముట్లన్నీ కాసేపు దాచేయమని
కాంక్రీట్ బతుకులకు
క్వారంటైన్ పరిచయం చేసిన
ప్రకృతి సందర్భం ఇది!
పనిముట్లు దాచుకుంటే పనియెట్లా మరి?
ఉత్పత్తి సాధనాలకు పనికొచ్చే పనిముట్లకే
ఈ తాత్కాలిక క్వారంటైన్ !
బ్రతుకు చెట్లని నరికే పనిముట్లను
శాశ్వతంగా క్వారంటైన్ చేయడమే
కావలసింది !
అందుకే, పచ్చని బతుకుల్ని విచ్ఛిన్నం చేసే
ఏ పనిముట్లనూ పక్కన పారేద్దామ్!
ప్రకృతిచ్చిన పచ్చని ఆక్సిజన్ని
ప్రేమతో పొదువుకుందాం !!

– వర్చస్వి
99483 56626

ఆన్‌లైన్ సమావేశ ఆహ్వానము

సాహితీ సోపతి
కరీంనగర్, తెలంగాణ



డాక్టర్ నలిమెల భాస్కర్
రచన
తెలంగాణ భాష - క్రియా పదాలు
వర్చువల్ ఆవిష్కరణ సమావేశం
జూలై 4, 2021 ఆదివారం సా. 5 నుండి 7.30 వరకు
Zoom Meeting : ID 363 900 4353
Youtube live : sahithi sopathi youtube channel

అధ్యక్షులు :
అన్నవరం దేవేందర్, కవి, రచయిత, కాలమిస్ట్
ముఖ్యాతిథి & ఆవిష్కర్త :
గాజోజు నాగభూషణం, కవి, రచయిత,
రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రచయితల వేదిక
విశిష్ట అతిథి :
నగునూరి శేఖర్, కవి, రచయిత,
రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ జర్నలిస్టుల సంఘం
వక్తలు :
వేముల సత్యనారాయణ, కవి, రచయిత,
రిటైర్డ్ ఉపన్యాసకులు
బూర్ల వేంకటేశ్వర్లు, కవి, రచయిత,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్.
ఆత్మీయ అతిథులు :
కందుకూరి అంజయ్య, కవి, రచయిత,
అధ్యక్షులు, తెరవే-కరీంనగర్.
ఎర్రోజు వెంకటేశ్వర్లు, కవి, రచయిత,
డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు
డా॥ వడ్డేపల్లి సంధ్య, కవి, రచయిత,
డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు
బుర్ర తిరుపతి, కవి, రచయిత, జర్నలిస్టు
స్వాగత వచనం :
సి.వి.కుమార్, కవి, రచయిత
వందన సమర్పణ :
విలాసాగరం రవీందర్, కవి, రచయిత
సమన్వయకర్త :
దామరకుంట శంకరయ్య, కవి, రచయిత - 9440876788
జూమ్ మీటింగ్‌కు పాస్‌వర్డ్ అవసరం లేదు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు
అడ్మిన్: రమాదేవి కులకర్ణి

'బుధవారం బాద్షా'

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ప్రథమ
బహుమతి విజేత

నిన్ను వెలిగించేది

శరీరంలో నాళాలు ఎండిన దారులైనపుడు
కన్నీటి బెదిరింపులకు భయపడిన రోజు
ఆటుపోట్లు నిన్ను అణిచిన రోజు
నయవంచన నీ నెత్తిన నాట్యమాడిన రోజు.
తాళలేని బాధల సెగలకు దాక్కున్న రోజు
ఛీత్కారాల తుఫానుకు చిక్కిన రోజు
నీలో నువ్వే వణికి దాగిన రోజు
నీ ఉనికి నిన్ను సందేహ పరిచిన నాడు.
నిరాశ గాయం మానని పుండైన రోజు
చులకన బురద నీపై పడిన రోజు
నీలోని కోపమే నిన్ను రాజేసిన రోజు
సాగే కాలంలో నీ నడక సాగనపుడు.
పయనించే అవకాశాలలో
నువ్వు దూరనపుడు
కాలం సాక్షిగా
ఆగని విధి సాక్షిగా
కావాలి వెలుగు బా
నిన్ను వెలిగించేదిగా

-కావ్య నరేష్

ద్వితీయ
బహుమతి విజేత

మలుపులెన్నో....

నిరంతరం సాగే
జీవన గమనానికి
ఎన్ని మలుపులో...
ముళ్ళ బాటలెదురై
మనిషిని రాటు దేల్చినా
పూల బాటలెదురై
సౌకుమారాన్ని పులిమినా
జీవన గమనంలో కష్ట సుఖాలు
వచ్చిపోయే వెలుగు నీడలే.
ఆనందాల మూటలు
ఎన్ని అట్టే పెట్టుకున్నా
కన్నీటి బాధలు
మరవలేని చేదు గురుతులను
మిగిల్చినా జీవన గమనానికి
అనుభవ పాఠాలే
అనుభవ పాఠాలని నెమరు వేసుకుంటూ
బతుకు రాదారులకు
వెలుగుపూలు పరచుకుంటూ
ఆఖరి మజిలీ దాకా
సాగించక తప్పని బతుకు పయనం

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

పుస్తక ఆవిష్కరణ

అదృశ్యరూపగ్రాహి
మువ్వా శ్రీనివాసరావు వైరాయణం కావ్యం
రచయిత : పులికొండ సుబ్బాచారి
7,July,2021,6.00pm
Venue:zoom,ID:2818589873,PW:223344
సభాధ్యక్షులు:శ్రీ మామిడి హరికృష్ణ
ఆవిష్కరణ:శ్రీ శివారెడ్డి
గౌరవ అతిథులు
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు డా.ఎస్ రఘు
ఆచార్య పిల్లలమర్రి రాములు డా.సీతారాం
సభా సమన్వయము
డా. జయప్రకాశ్
నిర్వహణ
తెలంగాణ సాహిత్య అకాడెమీ సౌజన్యంతో...
తెలుగు భాషా చైతన్య సమితి
లక్ష్య సాధన ఫౌండేషన్

ఏపీలో కొత్తగా 3,797 కరోనా కేసులు.. 35 మరణాలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 3797 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 5498 మంది చికిత్సకు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. 35 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 18,89,513కు పెరిగింది. ఇప్పటివరకు 18,38,469 మంది కోలుకున్నారు. మరో 38338 యాక్టివ్ కేసులున్నాయి. మొత్తం మరణాలు 12,706కు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ 97,696 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.